# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 31-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 263 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ఇంట్లో పేలుడు: తల్లీ కుమారుడి మృతి

పాట్నా,మే30(ఆర్ఎన్ఎ): బీహార్ రాష్ట్రం ముంగర్ జిల్లాలో ఘోరం జరిగింది. బరియార్‌పూర్ బజార్‌లోని ఓ ఇంట్లో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఆ ఇంట్లోని రోమాకుమారి (30) అనే మహిళతోపాటు ఆరు నెలల వయసున్న ఆమె కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉందని ముంగర్ జిల్లా ఎస్పీ లిపీ సింగ్ చెప్పారు. పేలుడు విషయం తెలిసిన తాము ఘటనా ప్రాంతానికి చేరుకున్నామని, డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీమ్‌ను పిలిపించి సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించామని ఎస్పీ లిపీ సింగ్ వెల్లడించారు. కాగా తమ కూతురు పెండ్లి విషయంలో ఆమె అత్తింటి వారితో గొడవలు జరుగుతున్నాయని మృతురాలు తల్లి పోలీసులకు చెప్పడంతో.. పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మృతురాలు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆ ఏరియా ప్రజలు ఆందోళనకు దిగడంతో.. జిల్లా అధికారులు కలుగజేసుకుని వారిని శాంతింప జేశారు.

# తెలంగాణ రైతులకు మరో శుభవార్త

### మరో వారంపాటు ధాన్యం కొనుగోళ్లు
### జూన్ 8వరకు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పంట కొనుగోలు కేంద్రాలను జూన్ 8 వరకు కొనసాగించ నున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. మొదట మే 31 వరకే కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐతే పలు ప్రాంతాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జూన్ 8 వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. వర్షాలు రాకముందే రైతులు పంటలను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ ఇంకా పూర్తి కాలేదని, అనేక గ్రామాల్లో ధాన్యం సేకరించి ఉందని వార్తలు వచ్చాయి. మరోవైపు ఇప్పటికే ప్రభుత్వం రికార్డుస్థాయిలో ధాన్యం సేకరణ చేసింది. దేశ వ్యాప్తంగా యాసంగి సీజన్ ధాన్యం సేకరణలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉందని భారత ఆహార సంస్థ ప్రకటించింది. దేశం మొత్తం మీద ఈ సీజన్‌లో 83.01 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరణ జరగ్గా, ఒక్క తెలంగాణ సొంతంగా 52.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి సరికొత్త రికార్డులు సృష్టించిందని తెలిపింది. ఇప్పటికే తెలంగాణ 91.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా సగానికి పైగా సేకరణపూర్తి చేసిందని వెల్లడించింది. ఇక ఆంధ్రప్రదేశ్ సైతం రికార్డు స్థాయిలో 23.04లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించి ందని పేర్కొంది. ఈ మేరకు భారత ఆహార సంస్థ సీఎండీ వి.వి.ప్రసాద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత లాక్‌డౌన్ పరిస్థితుల దృష్ట్యా, కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల్లోనూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటూ ధాన్యం కొనుగోళ్లను కొనసాగిస్తున్నది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీస్తున్నారు. సిద్ధిపేట జిల్లా మొత్తంలో 7లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. పలు గ్రామాల్లో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతులకు, కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## ఆరోగ్య సంస్థతో అమెరికా తెగదెంపులు

### చైనాకు తోలుబొమ్మగా మారిందన్న ట్రంప్

వాషింగ్టన్,మే30(ఆర్ఎన్ఎ): ప్రపంచ ఆరోగ్య సంస్థతో సంబంధాలను తెంచుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. కరోనా వైరస్‌ను నియంత్రించడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైనట్లు ట్రంప్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. నెల రోజుల క్రితం డబ్ల్యూహెచ్‌వోకు నిధులను నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు. చైనాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ తోలుబొమ్మలాగా వ్యవహరిస్తోందని ట్రంప్ ఆరోపించారు. డబ్ల్యూహెచ్‌వోలో సమూల మార్పులు జరగకుంటే, శాశ్వతంగా ఆ సంస్థకు నిధులను నిలిపివేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా, కావాల్సిన సంస్కరణలను డబ్ల్యూహెచ్‌వో చేపట్టలేదని ట్రంప్ విమర్శించారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థతో రిలేషన్‌షిప్‌ను వదులుకుంటున్నట్లు ట్రంప్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌వోకు బదులుగా, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యపరంగా అత్యవసరమైన దేశాలకు ఆ నిధులను మళ్లించనున్నట్లు ఆయన చెప్పారు. కరోనా వైరస్ పట్ల చైనా నుంచి సమాధానం కావాలని ప్రపంచ దేశాలు ఆశిస్తున్నాయని, ఈ విషయంలో పారదర్శకత అవసర మని ట్రంప్ అన్నారు.

# ఏడాది కాలంలో ఎన్నో చారిత్రక నిర్ణయాలు

### దేశం వేగంగా అభివృద్ధి సాధించింది
### కరోనా కారణంగా వలస కార్మికుల బాధలు వర్ణనాతీతం
### లాక్‌డౌన్‌తో కరోనా కట్టడిలో దేశం ఆదర్శంగా నిలిచింది
### ఏడాది పాలనపై ప్రజలకు లేఖ రాసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్ఎ): తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పేదల గౌరవం ఇనుమడిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. తన ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా గ్రామీణ-పట్టణాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నా యన్నారు. ఎన్డీయే-2 ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతిని ఉద్దేశించి లేఖ రాశారు. ప్రజల ఆదరాభిమానాలతో ఏడాది పాలన పూర్తి చేసుకున్నామన్నారు. గతేడాది ఇదే రోజు భారత ప్రజాస్వామ్యంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైంది. అనేక దశాబ్దాల తర్వాత దేశం పూర్తి మెజారిటీతో పూర్తికాల ప్రభుత్వానికి ఓటేసింది. భారతదేశం ప్రాముఖ్యత రోజురోజుకి పెరుగుతుంది. ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సవాళ్లను ఎదుర్కోవడంలో తమ ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వం గడిచిన ఏడాదిలో ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకుందన్నారు. అదేవిధంగా దేశం వేగంగా అభివృద్ధి సాధించి ందన్నారు. అయితే కరోనా వైరస్ కారణంగా వలస కార్మికులు, కూలీలు, ఇతరులు విపరీతమైన బాధలు అనుభవించారన్నారు. ఈ సంక్షోభంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగలేదని తాము చెప్పడం లేదన్నారు. కరోనా వైరస్ కారణంగా విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో వేల సంఖ్యలో వలస కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. స్వస్థలాలకు చేరుకునేందుకు నడక, సైకిళ్లు, ట్రక్కులను ఆశ్రయిస్తున్నారు. మన కూలీలు, వలస కార్మికులు, చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తులవారు, హస్త కళాకారులు, హాకర్లు ఈ సంక్షోభ సమయంలో తీవ్ర బాధలు అనుభవి ంచారన్నారు. అయినప్పటికి ఈ బాధలు, ఇబ్బందులు, అసౌకర్యాలు విపత్తులుగా మారకుండా చూసుకుందామన్నారు. కరోనా భారతదేశాన్ని తాకినప్పుడు భారత్ ప్రపంచానికి సమస్యగా మారుతుందని చాలా మంది భయపడ్డారు. కానీ నేడు మనం తీసుకున్న చర్యలతో ప్రపంచమే మన వైపు చూస్తుందన్నారు. కరోనా మహమ్మారిపై పోరాటంలో భారత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుందన్నారు. భారతీయుల సమిష్టి బలం, సామర్థ్యంతో ఇది నిరూపితమై ందన్నారు. ఇందుకు మీరే కారకులన్నారు. ప్రపంచంలోని శక్తివంతమైన, సంపన్న దేశాలతో పోల్చితే ఇది అసమానం అన్నారు. చప్పట్లు చరవడం గానీ, దీపాలు వెలిగి ంచడం గానీ, కరోనా యోధులను ఆర్మీ గౌరవించడం గానీ, జనతా కర్ఫ్యూ గానీ, దేశవ్యాప్త లాక్‌డౌన్ నియమాలను కచ్చితంగా పాటించడం ఇలా ప్రతి సందర్భంలోనూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అని నిరూపించారని ప్రధాని పేర్కొన్నారు. మన దేశం ఎన్నో సవాళ్లు, సమస్యలను ఎదుర్కొంటుందని ప్రధాని తెలిపారు. వీటిని ఎదుర్కొనేందుకు రాత్రనక, పగలనక తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇంకా చాలా చేయాల్సిన అవసరం ఉందని తనకు తెలుసన్నారు. తనలో లోపాలు ఉ ండొచ్చు.. కానీ దేశానికి కాదన్నారు. కాబట్టే తనకంటే దేశ ప్రజల్ని, వారి బలాన్ని, వారి సామర్థ్యాలను నమ్ముతున్నట్లు తెలిపారు. దేశం స్వావలంబ న దిశగా పయనిస్తుందని, ఆర్థిక పునరుజ్జీవనంలో భారతదేశం ఒక ఉదాహరణగా నిలుస్తుందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# దేశంలో ఆగని కరోనా విజృంభణ

### కొత్తగా 7964 పాజిటివ్ కేసులు
### మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,73,763

న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ కేసులు సంఖ్య పంజా విసురుతోంది. రోజు రోజుకూ కొత్త పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వరుసగా రెండవ రోజు కూడా పాజిటివ్ కేసులు ఏడు వేలు దాటాయి. గత 24 గంటల్లో దేశంలో కొత్తగా 7964 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇక మరణించిన వారి సంఖ్య కూడా అత్యధికంగా ఉన్నది. గత 24 గంటల్లో దేశంలో కరోనా వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య 265గా నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఒకే రోజు అత్యధిక స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదు కావడం ఇదే అత్యధికం. దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,73,763గా ఉన్నది. సుమారు 80 వేల మంది వైరస్ నుంచి కోలుకున్నారు. ఇకపోతే దేశంలో అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో కొనసాగుతున్నది. రాష్ట్రంలో కరోనా బారినపడుతున్న పోలీసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉన్నది. తాజాగా రాష్ట్రంలో గత 24 గంటల్లో 114 మంది పోలీసులు కరోనా పాజిటివ్‌లుగా తేలారు. ఈ వైరస్ ప్రభావంతో ఒకరు మరణించారు. దీంతో రాష్ట్రంలో కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న పోలీసుల సంఖ్య 2325కి చేరగా, మృతుల సంఖ్య 26కి పెరిగింది. శుక్రవారం రోజున మొత్తం 116 మంది పోలీసులు కరోనా బారిన పడగా, ముగ్గురు మరణించారు. ఇలా రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా పోలీస్ శాఖలో కరోనా కేసుల సంఖ్య అధికమవుతూనే ఉన్నది. మొత్తంగా మహారాష్ట్రలో ఇప్పటివరకు 62,228 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, 2098 మంది మరణించారు. రాష్ట్రంలో మరో 33,133 పాజిటివ్ కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇప్పటివరకు 26,997 మంది బాధితులు కోలుకుని దవాఖానల నుంచి డిశ్చార్జి అయ్యారు.

## రంగారెడ్డి,వనపర్తి జిల్లాల్లో ఇద్దరికి పాజిటివ్

### ఇద్దరిలో ఒకరు 13 నెలల చిన్నారు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లా యాచారంలో, వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మండలంలో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరుకు చెందిన ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో అతన్ని గాంధీ దవాఖానకు తరలించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌లో డైటీషియన్‌గా పనిచేస్తున్న ఆయన శుక్రవారం పెబ్బేరు వచ్చివెళ్లాడు. దీంతో అతనికి సంబంధించిన మూడు కుటుంబాల్లోని 11 మందిని హోం క్వారెంట్‌ను పంపించారు.

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో 13 నెలల చిన్నారికి కరోనా వైరస్‌సోకింది. దీంతో ఆ చిన్నారికి హైదరాబాద్ తరలించారు. చిన్నారి తండ్రి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

# కరోనా తరహాలో సీజనల్ వ్యాధులను ఎదుర్కోవాలి

### 1నుంచి 8 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం
### అందరూ పాల్గొనాలని మంత్రి ఎర్రబెల్లి పిలుపు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఆదేశాలతో జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు, ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ వివరాలను మంత్రి తెలియజేశారు. కరోనాను ఎదుర్కొన్న తరహాలోనే వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను ఎదుర్కొందామన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రపరుద్దామన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ సీజనల్ వ్యాధులు ధరిచేరకుండా జాగ్రత్త పడదామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని స్థాయిల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం-పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీల సభ్యులు నీరు నిల్వ ఉండే చోట్లను గుర్తించి తొలగించాలన్నారు.. డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వర్షపునీరు లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లేలా ఇప్పుడే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.. ఇంటింటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు.. గ్రామాల్లో క్లోరిన్ అవశేషాలను చెక్ చేస్తూ, స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. యథావిధిగా ప్రతి నెలా 1,11,21 తేదీల్లో ప్రతి 10 రోజులకోసారి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు.. లీకేజీలు లేకుండా, నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటిస్తూ ఆరోజు ప్రతి ఇంటిలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించాలన్నారు. దోమల నివారణకు ముందుగానే ఆయా ప్రాంతాలను గుర్తించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిని జిల్లా కలెక్టర్లు పంచాయతీ, ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో శిబిరాలు పెట్టడం, ఫాగింగ్ చేయడం, మలేరియా బాల్స్ స్ప్రే చేయడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



ప్రత్యేక పారిశుద్దయ కార్యక్రమంపై అదికారులతో మాట్లాడిని మంత్ఇర ఎర్రబెల్లి దయాకర్ రావు

# సీఎంఆర్‌ఎఫ్‌కు చందుపట్ల పీఏసీఎస్ ఛైర్మన్ రూ.2 లక్షల విరాళం



హైదరాబాద్: కరోనా వైరస్‌పై పోరాడుతున్న ప్రభుత్వానికి మద్దతుగా దాతలు తమ వంతు సహాయం అందిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చందుపట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహా రెడ్డి రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీనర్సింహారెడ్డిని అభినందించారు.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో తెలంగాణలో కరోనా కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. అయినా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, స్వీయ నియంత్రణ, భౌతిక దూరం పాటిస్తూ కరోనాను ఎదుర్కోవాలని సూచించారు. కరోనా నిర్మూలనకు ఈ మొత్తాన్ని ఉపయోగించాలని లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు.

## పలు జిల్లాల్లో గాలివాన బీభత్సం

### విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
### తడిసిన ధాన్యం రాశులు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాత్రి నుంచి వర్షం కురుస్తుంది. పశ్చిమ విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు, తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతుంది. మరఠ్వాడ, తెలంగాణ మీదుగా 0.9 కిలోమీటర్ల ఎత్తున ద్రోణి కొనసాగుతుంది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షం కురుస్తుంది.

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గాలివాన బీభత్సం సృష్టించింది. పలు మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల ధాన్యం తడిసింది. గాలివాన బీభత్సానికి వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం, తహారాపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ధాన్యపు రాశులు తడిశాయి. ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో గొర్రెలమందపై పిడుగుపడి మూడు గొర్రెలు మృతిచెందాయి. పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం తడిసింది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం గద్వాలతో పాటు దరూర్, కెటిదొడ్డి, గట్టు, ఐజలో ఈ తెల్లవారుజామున ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

మహబూబాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సానికి పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. గూడూరు మండలకేంద్రంలో సైతం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిస్థాయిలో తడిసిపోయింది. ధాన్యం, మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడ మండలం కొత్తపల్లి వద్ద బుర్కపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

# అర్హులకే డబుల్ బెడ్రూం ఇండ్లు: నిరంజన్‌రెడ్డి



వనపర్తి.మే 30: ప్రభుత్వం నిర్మించే డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులకే కేటాయిస్తామని రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటించారు. వనపర్తి సమీపంలోని గ్రామాల్లో నిర్మితమతున్న డబుల్ బెడ్రూం ఇండ్లను ఆయన పరిశీలించారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని చెప్పారు. లబ్దిదారులను త్వరలోనే ఎంపికచేస్తామని చెప్పారు. రోడ్ల విస్తరణలో నిరాశ్రయులైన పేదలకు ప్రాధాన్యమిస్తామన్నారు. సొంత స్థలాలున్న వారికి ఇండ్లు నిర్మించుకునేందకు సహాయం చేస్తామని తెలిపారు. పెద్దగూడెం చౌరస్తాలో 296, అప్పాయపల్లి శివారులో 160, చిట్యాల సమీపంలో 760 ఇండ్లు నిర్మితమవుతున్నాయని చెప్పారు. మొత్తం 1400 ఇండ్లను విడతలవారీగా పంపిణీ చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కలెక్టర్‌ను ఆదేశించారు. వీటితోపాటు పట్టణంలోని పీర్లగుట్ట, రామాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేదల కోసం మరో రెండు వేల గృహాలను త్వరలోనే మంజురు చేయిస్తానన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ "ఘట్టమనేని" కులంబున
పుట్టిన "శివరామకృష్ణ" పూజిత నటుడై
మట్టసముగ... పలు రసవ
ఘట్టములను తెలుగు తెరకు కానుకలిడెనిన్!



-రాధశ్రీ
సెల్: 9494481210

(మే 31 నటుడు కృష్ణ జన్మదినం..)

## వరవరరావు ఆరోగ్యంపై నివేదిక కోరిన కోర్టు

ముంబై,మే30(ఆర్ఎన్ఎ): విరసం నేత, మానవ హక్కుల కార్యకర్త వరవరరావు ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక కోర్టు నివేదిక కోరింది. భీమా కోరేగావ్ కుట్ర కేసులో అరెస్టు అయిన వరవరరావు.. కొంతకాలంగా ముంబైలోని తాలోజీ జైలులో ఉంటున్న విషయం విదితమే. అయితే ఆయన అస్వస్థతకు గురికావడంతో.. ముంబైలోని జేజే దవాఖానాలో జైలు సిబ్బంది చేర్పించారు. ఈ క్రమంలో తన భర్త ఆరోగ్య పరిస్థితిని తెలియజేయాలని వరవరరావు భార్య హేమలత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక కోర్టు జడ్జి డీఈ కొతాలికర్.. వరవరరావు మెడికల్ రిపోర్టును అందజేయాలని జేజే హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేశారు.

## వరవరరావును వెంటనే విడుదల చేయండి

### కేంద్ర రాష్ట్రాలకు కుటుంబ సభ్యుల వినతి

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): విరసం నేత వరవరరావుకి కరోనా టెస్ట్ చేశారని.. రిపోర్ట్ నెగిటివ్ అని వచ్చిందని ఆయన కూతురు పావన తెలిపారు. తన తండ్రికి వెంటనే తాత్కాలిక బెయిల్ ఇచ్చి జైల్ నుంచి విడుదల చేయాలని ఆమె కోరారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి చొరవ తీసుకొని బెయిల్ ఇప్పించాలని పావని కోరారు. హైదరాబాద్ పోలీసులు తమకు పాసులు ఇస్తామంటు న్నారని.. కానీ కోర్టు పర్మిషన్ ఉంటే మాత్రమే తన తండ్రిని కలవగలమన్నారు. కోర్టు పర్మిషన్ కోసం పిటిషన్ వేశామని.. పర్మిషన్ ఇస్తేనే ముంబైకి వెళ్లి కలుస్తామని పావన తెలిపారు. వరవరరావుతో తమకు వీడియో కాల్ చేయించాలన్నారు. మూడు రోజుల కిందనే వరవరరావు ఆరోగ్యం బాగాలేదని.. తాత్కాలిక బెయిల్ ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వంతో పాటు చీఫ్ జస్టిస్‌కి లెటర్ రాశామన్నారు. ముంబైలో కరోనా కేసులు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి తమకు ఆందోళనగా ఉందని పావన తెలిపారు. అక్కడ చికిత్స చేయడం అంత మంచిది కాదన్నారు. వెంటనే తమ తండ్రిని విడుదల చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# దినసరి కార్మికులకు జగపతిబాబు అండ

### నిత్యాసవర సరుకులు పంపిణీ చేసిన నటుడు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తిని నిర్మూలించేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్‌ని విధించిన నేపథ్యంలో దినసరి కార్మికులకు నటుడు జగపతిబాబు అండగా నిలిచారు. అష్టకష్టాలు పడుతున్న వారికి అండగా నిలిచేందుకు పలువురు సెలబ్రిటీలు,సేవా సంస్థలు ముందుకు వచ్చాయి.

జగపతిబాబు ఇటీవల సినీ కార్మికులకు స్వయంగా బియ్యం, పప్పులు, వంట నూనె తదితర నిత్యావసరాలను అందించారు. అలాగే కరోనా కట్టడిలో భాగంగా లాక్‌డౌన్‌ని పకడ్బందీగా నిర్వహిస్తున్న పోలీసులకి గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ వి.సి.సజ్జనార్‌ను కలిసి ఎన్-95 మాస్కులు, శానిటైజర్లను అందించారు.

తాజాగా జగపతి బాబు రోజువారి వేతనం పొందే సినీ కార్మికులతో పాటు ఆకలితో అలమటించే పదివేల మందికి నిత్యావసరాలు, మాస్కులు, శానిటైజర్స్ అందించారు. జగపతిబాబు ఔదార్యంపైప్రశంసలు వర్షం కురుస్తుంది. కాగా, ఒకప్పుడు హీరోగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఎంతగానో అలరించిన జగపతి బాబు ప్రస్తుతం విలన్‌గా, సపోర్టింగ్ పాత్రలలో కనిపించి అలరిస్తున్నాడు. అతని దాతృత్వాన్ని అంతా అభినందించారు.

# అపరిశుభ్రమైన నీటి వినియోగమే రోగాలకు కారణం...

నేటి నిజం
ఆదివారం 31-5-2020

విశ్వం యొక్క పుట్టుక ఎలా ఉన్నప్పటికీ ఈ సృష్టిలో సకల చరాచర జీవరాశుల మనుగడ మాత్రం నీటిపై ఆధారపడి ఉన్నది. జలం లేనిదే జనం లేరు. ప్రాణికోటి మనుగడకు జలం అత్యంత ఆవశ్యకం. మానవ శరీరం సుమారు 70శాతం నీటితో నిండి ఉంటుంది. అలాంటి ప్రాధాన్యతగల ప్రాణాధారమైన నీరే కరువైతే మానవాళి మనుగడ లేనే లేదు. ఇప్పటికే ఈ సుందరమైన భూగ్రహం మానవ తప్పిదాలతో విధ్వంసమైపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. వాతావరణ మార్పులతో, కాలుష్య కారకాలతో మానవ జీవనం అల్లకల్లోల సాగరంలా మారిపోయింది. యుద్ధాలతో, అశాంతితో, ఆకలితో, అధిక జనాభాతో, రోగాలతో, ప్రకృతి బీభత్సాలతో మానవ మనుగడ అత్యంత సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో ప్రాణాధారమైన నీరు కూడా సకల దుర్గంధాలతో నిండిపోవడం, భవిష్యత్తులో నీరే కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించడం మానవ కల్పితమే. ముమ్మాటికీ మానవ తప్పిదమే అని చెప్పక తప్పదు. 7.8 బిలియన్లుగల ప్రస్తుత ప్రపంచ జనాభా మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పెరిగిన జనాభాతోపాటు వారి అవసరాలకు సరిపడా వనరులను పెంచలేము. జనాభా పెరుగుదల ఫలితంగా ప్రకృతిని విధ్వంసం చేయవలసి వస్తున్నది. సహజవనరులు తరిగాయి. నీటి అవసరాలు పెరిగాయి. నీటి శాతం తరిగింది. 2040నాటికి నీటికోసం దారుణమైన పోరాటాలు జరిగే అవకాశం ఉంది. నీటి లభ్యత మృగ్యమై మరికొద్ది దశాబ్దాల్లో మానవ మనుగడ కడుదుర్లభంగా మారే అవకాశాలున్నాయి. 2050నాటికి నీటి లభ్యత లేక స్నానాలు మాని, రసాయన లేపనాలతో జీవించవలసి వస్తుందని మన క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం ఏనాడో హెచ్చరించాడు. మొత్తం జల సంప దలో ఒకవంతు మాత్రమే నేలపైన, మూడొంతులు సముద్రాల్లో నిండి ఉండడంవలన, సముద్ర జలం ఉప్పుతో కూడుకుని వ్యర్థంగా మారిన దశలో మనకు లభ్యమయ్యే 2.5 శాతం నీటి వనరులతోనే అవసరాలు తీర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. నీటి కొరత, నీటి కాలుష్యం, పారిశుద్ధ్య లోపాల వలన అనేక అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికీ మన దేశంలో 60 మిలియన్ల మందికి పైగా ప్రజలు సరైన నీరులేక బాధపడుతున్నారు. ఇప్పటికీ భారతదేశంలో 53శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి బ్రతుకుతున్నారు. వ్యవసాయానికి సరిపడా నీరు అందించలేక పంటల విస్తీర్ణంతగ్గి దేశ ఆర్థిక పరిస్థితి మందగించడం కూడా సహజమే. ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలు రాబోయే రోజుల్లో తీవ్రమైన నీటికొరతను ఎదుర్కోవలసి వస్తుంది. నాణ్యతాపరమైన త్రాగునీటి వినియోగంలో కూడా భారత్ వెనుకబడే ఉంది. అంతర్జాతీయ సంస్థలు జరిపిన సర్వే గణాంకాలను బట్టి నీటి నాణ్యతా ప్రమాణాల దృష్ట్యా ప్రపంచంలోని 122 దేశాలలో 120వ స్థానం భారతదేశానిది. కలుషితమైన నీటి వినియోగంవలన నీటిలో ఈ-కొలి బ్యాక్టీరియా చేరి మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఆహారం విషతుల్యంగా మారుతున్నది. కలరా, టైఫాయిడ్, డయేరియా లాంటి రోగాలకు అపరిశుభ్రమైన నీటి వినియోగమే కారణం. భారతదేశంలో ప్రజలకు సరఫరా కాబడే నీటిలో 70 శాతం ప్రమాదకరమైన కలుషితాలతో నిండి ఉన్నట్టు ఒక అంచనా. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో 3.1 శాతం మరణాలకు నీటి నాణ్యతా లోపమే కారణమని పేర్కొనడం గమనార్హం. 1993 మార్చి 22వ తేదీన ప్రప్రథమంగా ప్రపంచ జలదినోత్సవం (వరల్డ్ వాటర్ డే) జరిగింది. అప్పటి నుండి ప్రతీ సంవత్సరం మార్చి 22వ తేదీన ప్రపంచ దేశాలన్నీ జల దినోత్సవంగా పాటిస్తున్నాయి. 2030 సంవత్సరంనాటికి అందరికీ పరిశుభ్రమైన నీరు అందించడమే ధ్యేయంగా ప్రారంభమైన ప్రపంచ జల దినోత్సవం ఈ ఏడాది 'నీటి ఆవశ్యకత-వాతావరణ మార్పులు'అనే థీమ్‌ను ఎంచుకుని మనముందుకు రాబోతున్నది. ప్రజలకు స్వచ్ఛమైన జలాన్ని అందించడం, నీటి వినియోగాన్ని తగ్గించుకోవడం, వృథాగా కడలిలో కలుస్తున్న నీటిని ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా వినియోగంలోకి తీసుకురావడం మనముందున్న తక్షణ కర్తవ్యం.

## కేరళను రుతుపవనాలు తాకాయన్న స్కైమెట్

### 1న తాకుతాయంటున్న భారత వాతావరణ విభాగం

### అక్కడక్కడా వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన ఉష్ణోగ్రతలు

తిరువనంతపురం/హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): దేశానికీ చల్లటి వార్త వెలువడింది. రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినట్లు ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ పేర్కొంది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా కంటే రెండు రోజుల ముందుగానే రుతుపవనాలు కేరళకు చేరుకున్నాయి. జూన్ 1 న రుతుపవనాల రాక గురించి ఐఎండి రెండు రోజుల కిందట ప్రకటన చేసింది. ఈసారి రుతుపవనాలు సగటున ఉండబోతున్నాయని వాతావరణ శాఖ ఏప్రిల్‌లో తెలిపింది. ఈసారి 96 నుండి 100శాతం వర్షపాతం నమోదైతే సాధారణ రుతుపవనాలుగా పరిగణించబడుతుంది. గతేడాది ఎనిమిది రోజుల ఆలస్యంతో జూన్ 8 న కేరళ తీరాన్ని తాకాయి.. జూన్ , సెప్టెంబర్ మధ్య నైరుతి రుతుపవనాల ద్వారా భారతదేశంలో వర్షాలు కురుస్తాయి. ఇదిలావుంటే రాగల 24 గంటలలో దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కోమోరిన్ ప్రాంతం, నైఋతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు నైఋతి

రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాగల 48 గంటలలో ఆగ్నేయ అరేబియా సముద్రం, తూర్పు మధ్య అరేబియా సముద్రం ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. తదుపరి 48 గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి తూర్పు మధ్య అరేబియా సముద్రం, ఆగ్నేయ అరేబియా సముద్రం ప్రాంతాలలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణలో రాగల మూడురోజుల వరకు వాతావరణ సూచన ఉందన్నారు. జూన్ 1న కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని, చత్తీస్‌గఢ్ ప్రాంతంలో 2 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక, కేరళ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడనుంది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో వడగాల్పులు అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు పడనున్నాయి. ఆదివారం కొన్నిచోట్ల.. సోమవారం చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. అక్కడక్కడా కురినిస వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. దక్షిణ తమిళనాడు, తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడిందని అధికారులు తెలిపారు.

## లారీ ఢీకొనడంతో గడ్డి ట్రాక్టర్ బోల్తా

### ఒకరు మృతి..ముగ్గురికి గాయాలు

సిద్దిపేట,మే30(ఆర్ఎన్ఎ): గడ్డి ట్రాక్టర్ బోల్తాపడ్డ ఘటనలో ఒకరు మృతి చెందారు. సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం లకుడారం శివారులో రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో ట్రాక్టర్ పైన ఉన్న ఒకరు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జగదేవ్‌పూర్ మండలం ఎల్లాయగూడ గ్రామానికి చెందిన పలువురు తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లి నుంచి ఎల్లాయగూడకు గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువెలుతున్నారు. లకుడారం శివారులో అదే మార్గంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు ఉన్న లోడుతో వెల్తున్న లారీ వెనుక భాగం ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న మాసపాక సత్తయ్య (50) అక్కడికక్కడే మృతి చెందగా మాసపాక కృష్ణ, రాజు, కనకయ్య, రాయపోల్ రాజు అనే నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారికి చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూర్‌పల్లి పోలీసులు తెలిపారు.

## అగ్రివర్సిటీ డిప్లమా కోర్సులకు ప్రవేశాలు

### -పాలిసెట్ ఎంట్రెన్స్ ఆధారంగా ఎంపిక

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ డిప్లొమా కోర్సులలో 2020-21 విద్యాసంవత్సరానికి అడ్మిషన్‌లకోసం పాలిసెట్-2020 ప్రవేశాలను పరీక్ష ర్యాంకుల ఆధారంగానే జరుపుతామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. సుధీర్‌కుమార్ తెలిపారు. అందుకే డిప్లొమా కోర్సులలో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు పాలిసెట్ -2020 ప్రవేశ పరీక్షకు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు. వివిధ వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కొరకు పాలిసెట్-2020 ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడించిన తర్వాత విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విశ్వవిద్యాలయ అడ్మిషన్ నోటిఫికేషన్ ప్రకారంగా వీడిగా దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి అభ్యర్థులు కనీసం 4సంవత్సరాలు గ్రామీణ ప్రాంతంలో చదివి ఉండాలి. పాలిసెట్-2020 ర్యాంకు లేకపోతే విశ్వవిద్యాలయం డివ÷-లోమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉండదని అన్నారు. సీట్ల కేటాయింపు విశ్వవిద్యాలయం నిర్వహించే కౌన్సిలింగ్ పక్రియ నియమ నిబంధనల ప్రకారం, రిజర్వేషన్ నియమాలకు లోబడి నిర్వహిస్తామన్నారు. పాలిసెట్- 2020 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 9 వరకు పొడిగించినట్టు తెలిపారు.

## వన్యప్రాణులు జనారణ్యంలోకి రాకుండా చర్యలు

### -ఇటీవలి ఘటనల నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ వెల్లడి

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): తాగునీటి కోసం వన్య ప్రాణులు జనారణ్యంలోకి రాకుండా అటవీశాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని అటవీ, పర్యావరణశాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జనావాసాల్లోకి ఇటీవల కాలంలో తరచూ చిరుతపులులు, ఇతర జంతువులు వస్తున్న తరుణంలో దీనిపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పందించారు. సాధారణంగా ఎండాకాలంలో ఆవాసాలను వదిలి నీటిని, ఆహారాన్ని వెతుక్కుంటూ వన్య ప్రాణులు జనావాసాల్లోకి వస్తుంటాయని అన్నారు.

అయితే లాక్‌డౌన్ వల్ల మనుషుల సంచారం, వాహనాల శబ్దాలు కూడా తేకపోవడంతో పక్షులు, వణ్య ప్రాణులు మరింత స్వేచ్ఛగా విహరిస్తున్నాయని తెలిపారు. సమస్యను నివారించే చర్యల్లో భాగంగా అడవుల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అభయారణ్యంలో జంతువుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా నీటి వనరుల ఏర్పాటుకు అటవీశాఖలో ప్రత్యేకంగా ఓ విభాగం పనిచేస్తుందని వెల్లడించారు. ప్రతి వేసవిలోనూ వాగులు, వంకలు ఎండిపోయి తాగునీటికి ఇబ్బంది కలిగే పరిస్థితుల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వాటిని కాపాడేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు సోలార్‌పంప్ సెట్లతో పాటు సోలార్ పిట్లు నిర్మించి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపడం వంటివి చేస్తున్నారని చెప్పారు. శాఖాహార జంతువుల కోసం గడ్డిక్షేత్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వణ్య ప్రాణుల కదలికలను పసిగట్టేందుకు అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు.

# రాజ్యాంగానికి లోబడే నిర్ణయాలు ఉండాలి

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ):రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్‌ను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను కొట్టివేస్తూ.. ఆయనను ఎన్నికల కమిషనర్‌గా కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు పాలకులకు కనువిప్పు కావాలి. అలాగే ఇటీవలి కాలంలో అనేక విషయాల్లో హైకోర్టు ఇచ్చిన తీర్పులు ప్రభుత్వ నిర్ణయాలను తప్పు పట్టేవిగా ఉన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి నిర్ణయాలు తీసుకోలేవడం లేదని పలు సందర్భాల్లో రుజువు అయ్యింది. అందుకే తాజాగా నిమ్మగడ్డ విషయంలో రాష్ట్ర హైకోర్టు ఆర్డినెన్సును కొట్టేసింది. నిమ్మగడ్డ రమేశ్ కుమార్ స్థానిక ఎన్నికల పక్రియను వాయిదా వేసినప్పుడు అధికార పార్టీకి ఆగ్రహం కలిగింది. తమకు ఇష్టం లేని విధంగా కమిషన్ నిర్ణయం తీసుకున్నందున కమిషనర్‌నే మార్చుద్దామని ఆర్డినెన్స్ తీసుకుని వచ్చారు. ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిచినప్పటికీ పాలన మాత్రం రాజ్యాంగబద్ధంగా సాగాల్సిందే. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లుగా పాలన చేస్తాం అంటే కుదరదు! రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ విషయం మరోసారి స్పష్టమైంది. ప్రజలు ఎన్నుకున్న వారు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి తప్ప నేను చెప్పిందే వేదం అన్న రీతిలో ముందుకు సాగడం కుదరదు. మనకంటూ ఓ రాజ్యాంగం ఉంది. దానికి కట్టుబడి పనిచేస్తామనే ఎన్నికైన వారు ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చారు. అలా ప్రమాణం చేసిన వారు రాజ్యాంగానికి విరుద్దంగా నిర్ణయాలు తీసుకుంటే కోర్టులు చూస్తూ ఊరుకోవు. కోర్టు తీర్పులను అవహేళన్యం చేయడం...విమర్శించడం కూడా సరికాదు. కోర్టులు షాక్ ఇచ్చాయని వార్తలు రావడం సహజం.. వాటిని కూడా ఎద్దేవా చేసేలా మాట్లాడడం అధికార పార్టీకి తగదు. ఏపిలో ఇటీవలి కాలంలో కోర్టుల్లో అనేక విషయాల్లో వైకాపా ప్రభుత్వానికి షాకులు, లేదా మొట్టికాయలు పడ్డాయి. ఇవన్నీ ఎందుకిలా జరిగాయో అర్థం చేసుకోవాలి. అంతేగాని తమ నిర్ణయాలకు వ్యతిరేకంగా కోర్టుల తీర్పులు ఉన్నాయనుకోరాదు. ఒకవేళ అలా అనుకుంటే అప్రమత్తంగా రాజ్యాంగానికి బద్దమై నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడు కోర్టులు కూడా ఏమీ వ్యతిరే కించవు. వ్యక్తి, ఒక వ్యవస్థ, లేదా ఒక పద్దతి పూర్తిగా పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా మనుగడ సాగించేందుకు రాజ్యాంగం ఉంది. అయితే దానిని కాదని ముందుకు పోతామంటే కుదరదు. రాజ్యాంగం కల్పించిన అవకాశం మేరకే ఎన్నికల్లో గెలిచారు. గెలిచిన వారు పాలన చేయడానికే కాని ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడానికి కాదు. అంతా నా ఇష్ట ప్రకారం జరగాలన్న ధోరణి సరికాదు. ఏదైనా తేడా వస్తే... హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు జోక్యం చేసుకుని సరిచేసుకున్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రాథమిక హక్కుల విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పులు ఇచ్చిన సందార్భాలు కూడా అనేకం ఉన్నాయి. చట్టాలు రూపొందించే, వాటిని అమలుచేసే పరిపాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ...ఈ మూడూ వేటికవే స్వతంత్రంగా పనిచేసేలా రాజ్యంగం లో రాసుకున్నాం.ఒకదానికంటే ఒకటి తక్కువగా ఏర్పాటుచేయలేదు. ఈ ఏర్పాటువల్లే తాత్కాలిక అన్యాయం జరిగినా...మళ్లీ మరో వ్యవస్థ దాన్ని సరిదిద్దేందుకు ఆస్కారం ఏర్పడింది. అధికారంలో ఉన్న పార్టీలు ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయాలు తీసుకుని, దబాయిస్తామంటే కుదరదు. చట్టసభలు చట్టాలు చేస్తాయి. అవి న్యాయానికి, రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా? లేదా? అని చూసే బాధ్యత న్యాయస్థానాలది. అదేవిధంగా చట్టాలను అమలుచేసే బాధ్యతను రాజ్యాంగం పాలనా యంత్రాంగానికి అప్పగించింది. చట్టాలను చేసిన వారే వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కుతామంటే కుదరదు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరొందిన భారత రాజ్యాంగంలో ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా రాశారు. అన్ని విషయాలపై లోతుగా చర్చించి, భవిష్యత్తును ఊహించి మరీ ఆయా అంశాలను పొందుపరిచారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధులు, బాధ్యతలను ఆర్టికల్ 243(కె)లో వివరంగా చెప్పారు. ఎస్‌ఈసీ పదవీకాలం

కూడా నియామక ఉత్తర్వుల్లోనే పొందుపరచాలి. దానిని మధ్యలో మార్చే అధికారం పాలకులకు ఇస్తే... స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు అవకాశం ఉండదు. ఈ ప్రభుత్వం మాది. ప్రజలు మాకు 151 సీట్లు ఇచ్చారు. ఎన్నికల కమిషనరే నిర్ణయాలు తీసుకుంటే ఇక మేమెందుకు? పాలించేది మేమా.... ఆయనా అని చేసిన వ్యాఖ్యలు అహంకాపూరితంగా ఉన్నాయే తప్ప మరోటి కాదు. ఇకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలే అమలు జరుగుతాయి. అయితే, ఆ నిర్ణయాలు రాజ్యాంగానికి, చట్టానికి లోబడి ఉండాలి. అలా జరగనప్పుడు అభ్యంతర పెట్టవలసిన బాధ్యత అఖిల భారత సర్వీస్ అధికారులపై ఉంటుంది. విధి నిర్వహణలో నిబంధనలు, ధర్మాన్ని, చట్టాన్ని పాటించని పక్షంలో ఏమిజరగాలో ఆంధ్రప్రదేశ్‌లో అదేజరిగింది. శుక్రవారంనాడు హైకోర్టు ఇచ్చిన రెండు కీలక తీర్పులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తలవంపుగా మారాయి. అలాగే సోషల్ మీడియాలో పోస్టులపై కేసులు నమోదయ్యాయి. పలువురికి నోటీసులు ఇచ్చారు. హైకోర్టును, జడ్జిలను నిందిస్తూ పెట్టిన పోస్టులు చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా అన్న అనుమానం కలుగుతుంది. ఓ ఎంపి దారుణంగా వ్యాఖ్యలు చేయడం సహించరానిది. చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించ వలసిన పోలీస్ అధికారులు ప్రభుత్వాన్ని విమర్శించకూడదని ఎలా హెచ్చరిస్తారు. రాజ్యాంగ నిబంధనలు,చట్టాలకు లోబడి పనిచేయవలసిన అఖిల భారత సర్వీస్ అధికారులు, అందుకు విరుద్ధంగా ప్రభువుల అనుగ్రహం పొందడా నికి తాపత్రయపడితే ఏమి జరగాలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదంటూ తమ ఫిర్యాదులను తెలంగాణ పోలీసులకు ఇచ్చేవారు. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని చెబుతున్న వాళ్ల న్యాయమూర్తులు అయినప్పటికీ వారికి కూడా దురుద్దేశాలు అంటగట్టడానికి వెనుకాడటం లేదు. న్యాయవ్యవస్థకు కులాన్ని అంటగట్టే దుస్సాహసానికి ఒడిగడుతున్నారు. ఇలాంటి విపరీత పోకడలను గతంలో ఎన్నడూ ఎవరూ చూడలేదు. కార్యనిర్వాహక వ్యవస్థకు పరిమితులు ఉంటాయి. న్యాయ సమీక్షకు నిలబడేలా నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. అలాకాని పక్షంలో కోర్టులు చూస్తూ ఊరుకోవని గుర్తించాలి.

# విద్యాసంవత్సరంపైనే సర్వత్రా చర్చ

## టెన్త్ పరీక్షలు సజావుగా ముగిసాకనే స్పష్టత

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): విద్యాసంవత్సరం ఎప్పుడు జరుగుతుందన్న చర్చ ఇప్పుడు మళ్లీ జోరుగా సాగుతోంది. టెన్త్ పరీక్షల నిర్వహణకు ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాట్లు జరుగుతున్న వేళ.. తదుపరి విద్యా సంవత్సరం ఎప్పుడన్న ప్రశ్న సహజంగానే వస్తుంది.అయితే కరోనాతో సహజీవనం చేయాల్సిన పరిస్థితులు తప్పవని చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో చిన్నారులను స్కూళ్లకు పంపగలమా అని తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పరీక్షలు రాసేసి వేసవి సెలవుల్లో హాయిగా ఆటపాటల్లో మునిగి తేలాల్సిన విద్యార్థులు కరోనా దెబ్బతో ఇళ్లకే పరిమితమై విసుగుతో వేసారిపోతున్నారు. ఇకపోతే ఆగస్టు మొదటి వారంలో పాఠశాలలు పున:ప్రారంభం కానున్నట్లుగ ఆసంకేతాలు వస్తున్నాయి. కరోనా కారణంగా విద్యా సంవత్సరంలో చాలా భాగం వృధా అయ్యింది. తదుపరి ఏడాది కూడా ఇదే పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏప్రిల్ 30తో అకడమిక్ ఇయర్ ముగించాల్సి వుంటుంది. ఇందుకోసం దసరా, సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ పూర్తి చేయవచ్చు. కరోనా విజృంభణ ఇలానే కొనసాగితే రెండు షిఫ్టుల్లో తరగతులు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇదే జరిగితే ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతుంది. అందువల్ల ఈ సెలవుల్లోనే బదిలీలు, హేతుబద్దీకరణ, అవసరమైన చోట నియామకాలు వంటివి పూర్తి చేసి రెండు షిఫ్టులకు సరిపడ బోధనా సిబ్బందిని సమకూర్చుకోవాలి. లోటుపాట్లు ఏవీ లేకుండా పాఠశాల విద్యారంగాన్ని అభివృద్ధి పంథా పట్టించాల్సిన అసలు పరీక్ష ఎదుర్కోవాల్సింది ప్రభుత్వమే. సరైన దిశలో వ్యవహరించి, ఉపాధ్యాయులను కూడా పూర్తి విశ్వాసం లోకి తీసుకుని వ్యవహరిస్తే వారి కీలక సహకారం కూడా పొందగలుగుతుంది. ఈ దశలో ప్రభుత్వాలు పదో తరగతి పరీక్షల నిర్వహణలోనూ, పాఠశాల పున:ప్రారంభంలోనూ ప్రణాళికాబద్ధంగా, సునిశితంగా వ్యవహరించాల్సిన అవసరవుంది. పిల్లల మనసులపై ఎటువంటి ఒత్తిడి పెంచినా దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. లాక్‌డౌన్‌తో గ్రామీణ విద్యార్థుల్లో చాలామంది బతుకు దినదినగండమై ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న అమ్మనాన్నలకు సాయపడేందుకు పొలం పనులకు కూలికెళున్నారు. మొక్కజొన్న, మిర్చి, మామిడి పంట కోతలకు కూలీలుగా వెళ్తున్నవారిలో ఇప్పుడు అత్యధికులు వీరే. కొందరు మినహాయిస్తే చాలా మంది పిల్లల చదువులు అటకెక్కాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో జూన్ 8 నుంచి, ఏపిలో జులై 10 నుంచి 17 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని టైమ్ టేబుల్ విడుదల చేసారు. ఎప్పుడో పరీక్షలు రాసేసి ఫలితాలు కూడా అందుకుని ఇంటర్‌లో చేరే సమయంలో భయంగా పది పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఏపిలో ప్రశ్నాపత్రాలు 12 నుంచి 6కు కుదించడంతో 12 రోజుల్లో రాయాల్సిన పరీక్షలు ఆరు రోజుల్లో రాసేయాల్సి రావడమే ఇబ్బందికరం. విద్యార్థులకు గుబులు పుట్టిస్తున్నది. సిలబస్ భారంతో, స్జబెక్టులు కలగలసి పోవడంతో విద్యార్థులు తికమకపడే వీలుంది. అయితే ఎక్కడి విద్యార్థులకు అక్కడే పరీక్షలు నిర్వహించడం ఒక మంచి నిర్ణయం. కానీ కరోనా వ్యాప్తి అధికంగా ఉండే రెడ్‌జోన్లలో పరీక్ష కేంద్రాలు ఉంటాయా ఉండవా అనేదానిపై ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. ఈ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరాన్ని కూడా విద్యాశాఖ గుర్తించాలి. లాక్‌డౌన్ కొనసాగించినా, కొన సాగించకపోయినా విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా పరీక్షా కేంద్రాలకు రాకపోకల ప్రయాణ ఏర్పాట్ల బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈ కరోనా సంక్షోభాన్నే సాకుగా చూపి ఆన్‌లైన్, డిజిటల్ ఎడ్యుకేషన్ పేరుతో సాంప్రదాయ విద్యపై కత్తి వేలాడదీస్తోంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, సిబిఎస్ఇ, ఎన్‌సిఇ ఆర్‌టి ఇటీవల కాలంలో ఆన్‌లైన్ క్లాసులు, డిజిటిల్ ఎడ్యుకేషన్‌పై చాలా వేగంగా కస రత్తు చేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ఇంటర్నెట్, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల లభ్యతను, గ్రామీణ ప్రజల అక్షరాస్యతను, విద్యా స్థాయిని ఏమాత్రం పట్టించు కోకుండా ఆన్‌లైన్ క్లాసులను, హోం ఎడ్యుకేషన్ పేర రుద్దేందుకు సిద్దమవుతున్నారు. ఇదే తప్పిదాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేయకుండా జాగ్రత్త వహించాలి. సాంప్రదాయ విద్యకు ఆన్‌లైన్ పద్ధతులు అదనపు ప్రయోజనం కావాలే మినహా అసలు విద్యకు అదే ప్రత్యామ్నాయం కాబోదు.

## యూనివర్సిటీలతో గవర్నర్ నేరుగా చర్చలు

### విద్యాసంబంధ అంశాలపై ఆరా

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): యూనివర్ఇసటీల పనితీరుపై గవర్కనార్ ఆరా తీస్తున్నారు. స్వయంగా వీడియో కానఫరెన్స్ ద్వారా చర్చిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల టీచింగ్ స్టాఫ్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయించారు. అందులో భాగంగానే శుక్రవారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీతో పాటు దాని అనుబంధ కాలేజీల టీచింగ్‌స్టాఫ్‌తో మాట్లాడారు. ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల స్టాఫ్‌తో రోజు విడిచి రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు తెఇపారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాటాడుతూ ఉన్నత విద్యాశాఖ అధికారులతో రెండు వారాల పాటు ఇంటరాక్ట్ కాబోతున్నట్టు తెలిపారు. తద్వారా యూనివర్శిటీల పనితీరు, విద్యాసంబంధ అంశాలపై వారితో చర్చిస్తామని గవర్నర్ తెలిపారు.

## రెసిడెన్షియల్ విద్యార్థులను సన్నద్ధం చేయాలి

### టెన్త్ పరీక్షలపై అధికారులతో మంత్రి కొప్పుల సమీక్ష

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ వల్ల వాయిదా పడ్డ పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం తేదీలను ప్రకటించినందున రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులకు సూచించారు. లాక్ డౌన్ కారణంగా ఆగిపోయిన పదోతరగతి పరీక్షలు వచ్చే నెల 8వ తేదీన ప్రారంభం అవుతున్నందున విద్యార్థులందరూ సంబంధిత ఆశ్రమ పాఠశాలలో ఈనెల 1న చేరుకుంటారని, వారి ఆరోగ్య పరిరక్షణ గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ సంక్షేమ భవన్ లోని సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలలలో ఉన్న విద్యార్థుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల అందరూ ఆందోళనలో ఉన్నందున సంబంధిత ప్రిన్సిపాల్, స్టాఫ్ నర్సులు, విద్యార్థులు కోవిడ్-19 పై తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, పరిశుభ్రత భౌతిక దూరం మొదలైన వాటి మీద అప్రమత్తంగా ఉండేలా అందరికీ అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తవిద్యార్థుల మధ్య తరగతి గదులు, వసతిగృహాల్లో డైనింగ్ హాలులో భౌతిక దూరం తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలల్లో మొత్తం 12163 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వారిలో 4155 మంది బాలురు, 7988 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. మంత్రి సూచనలు తప్పకుండా పాటిస్తామని తెలిపారు.

## నియంత్రిత సాగుతో రైతులకు మేలు

### గిట్టుబాటుధరల సమస్యా ఉండదు: మంత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి




సూర్యాపేట జిల్లా కోదాడలో నియంత్ఇరత సాగుపై రైతలకు ఏర్పాటుచ ఏసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,మే30(ఆర్ఎన్ఎ): రైతులకు బాసటగా నిలిచేందుకే ప్రభుత్వం నియంత్రిత సాగు విధానాన్ని సూచిస్తుందని రాష్ట్ర మంత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. దీంతో రైతులకు మద్దతు ధరల భరోసా ఉంటుందన్నారు.

అందరూ ఒకేరకమైన పంటలు వేస్తే అమ్మకాలు కూడా సాధ్యం కాదన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో నియంత్రిత సాగు విధానంపై రైతులకు, అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డిమాండ్ ఉన్న పంటలను మాత్రమే సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. దళారుల మోసానికి గురైతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే సీఎం కేసీఆర్ నియంత్రిత సాగు విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ క్రమంలో అందరూ రైతులకు బాసటగా నిలవాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతులకు రుణమాఫీ, రుణాల మంజూరు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే రజాక్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌కురానున్న తొలి శ్రామిక్ రైలు

### ఇక్కడి నుంచి బస్సుల్లో కార్మికుల తరలింపు

నిజామాబాద్,మే30(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కారణంగా వివిధ రాష్ట్రాల్లో చిక్కుకుపోయిన వలస కార్మికులను తరలించేందుకు కేంద్రం శ్రామిక్ స్పెషల్ రైళ్లను పడుపుతోంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర నుంచి తెలంగాణకు తొలి శ్రామిక్ రైలు రానుంది. 1,725 మంది వలస కార్మికులు, యాత్రికులు, విద్యార్థులతో ముంబై నుంచి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు శ్రామిక్ రైలు రానుంది. ఈ రైలులో నిజామాబాద్ జిల్లాకు చెందిన 482 మంది కార్మికులు ఉన్నారు. వీరు నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్‌లో దిగనున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల వలస కార్మికులు నిజామాబాద్‌లో దిగనున్నారు. నిజామాబాద్ నుంచి వీరిని ప్రత్యేక బస్సుల్లో స్వస్థలాలకు తరలించనున్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో థర్మల్ స్క్రీనింగ్, క్వారంటైన్ ముద్ర వేయనున్నారు.



## లాక్‌డౌన్ ముగింపు వేళ కేంద్రం తర్జనభర్జన

### -ప్రధాని మోడీతో అమిత్ షా సుదీర్ఘ చర్చ

న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్2ఎ): లాక్‌డౌన్ ఈ నెల 31న ముగుస్తున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని 7 లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసంలో వీరి భేటీ జరిగింది. దేశంలో కరోనా వైరస్ తీవ్రత, లాక్‌డౌన్ తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. హోంమంత్రి అమిత్‌షా గురువారం రాత్రి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ లాక్‌డౌన్‌పై అభిప్రాయాలు కోరారు. ఈ నేపథ్యంలో అమిత్ షా ప్రధానితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలావుంటే, దేశంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 24 గంటల్లో 7467 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశంలో కరోనా కాలుమోపిన తర్వాత ఒకేరోజు ఇన్ని కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో కరోనా మహమ్మారి కట్టడికి ఇంకా ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి అనే అంశంపై వారి భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. కాగా, రెండు వారాల్లో లాక్‌డౌన్ ముగుస్తున్న నేపథ్యంలో కేంద్రం మళ్లీ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

## సరిహద్దుల్లో ఏం జరుగతోంది

### -ప్రజలకు వివరణ ఇవ్వండి: రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్ఎ): భారత-చైనా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకుడు,ఎంపి రాహుల్ గాంధీ అన్నారు. సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులు అనేక ఊహాగానాలకు తావిస్తుందని అన్నారు. ఈ మేరకు ట్విటర్‌లో రాహుల్.. ఓ పోస్ట్ చేశారు. ఈ సంక్షోభ సమయంలో కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. సరిహద్దు పరిస్థితులపై కేంద్రం మౌనం వీడి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇదివరకే ఈ పరిస్థితులపై స్పందించిన భారత విదేశాంగ శాఖ.. చైనాతో మిలటరీ స్థాయిలో, దౌత్య మార్గాల్లో వివాద పరిష్కార పక్రియ కొనసాగుతోందని వెల్లడించింది. అయితే, దేశ రక్షణ, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో రాజీ లేదని తేల్చి చెప్పింది. శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం అని పేర్కొంది. కాగా, ప్రపంచ దేశాలు కరోనాపై పోరు చేస్తుంటే.. చైనా మాత్రం భారత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులను సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. వాస్తవాధీన రేఖ వద్ద బలగాలను పెంచి భారత్‌లో హెచ్చరికలు పంపిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు హాంకాంగ్ విషయంలో చైనా తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. కరోనా విషయంలో ప్రపంచ దేశాలనుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న చైనా.. వాటి నుంచి దృష్టి మర టల్చడానికే సరిహద్దు వివాదాలతో సరికొత్త డ్రామా ఆడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# నకిలీ పత్తివిత్తన ముఠా అరెస్ట్

## 2 టన్నుల విత్తనాలు స్వాధీనం

రంగారెడ్డి,మే30(ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లా కందుకూరు లో నకిలీ పత్తి విత్తనాలు తయారు చేస్తున్న ముఠాని ఎల్‌బీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. కందుకూరులో గుట్టుచప్పుడు కాకుండా ఒకే రకం విత్తనాలని వివిధ రకాల బ్రాండ్‌లకి చెందిన ప్యాకింగ్ కవర్‌లలో నింపి రైతుల్ని మోసం చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాలో నలుగురు వ్యక్తులని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి 50 లక్షల విలువైన సుమారు 2 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు,ఒక డిసిఎం వ్యాన్,ఒక సీడ్ ప్రాసెస్సింగ్ మిషన్,ఒక కలర్ డబ్బా మరియు ప్యాకింగ్ కవర్లను పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. జోగులాంబ గద్వాలకి చెందిన మన్యం లక్ష్మీ నారాయణ హైదరాబాద్‌లో నివాసముంటూ.. గత మూడు సంవత్సరాల క్రితం కందుకూరులో ఈ విత్తనాలు తయారీ కంపెనీని ప్రారంభించాడు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా కర్నూల్ జిల్లా నుండి వివిధ బ్రాండ్ లకి చెందిన కవర్లని తెచ్చుకుని, రైతులు తాము అడిగిన బ్రాండ్ కవర్లలో ఒకే రకానికి చెందిన విత్తనాలను నింపి సరఫరా చేసేవాడు. ఇలా మోసాలకు పాల్పడుతున్నారన్న పక్క సమాచారం తో దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గతం లో కూడా పలు జిల్లాల్లో కేసులు నమోదు అయినట్లు రాచకొండ సిపి మహేష్ భగవత్ తెలిపారు. ఇలా నకిలీ విత్తనాల కంపెనీలు ,నకిలీ విత్తనాలు కొని మోసపోయామని ఎవరైనా రైతులు పిర్యాదు చేస్తే అలాంటి కంపెనీ ల పై చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

# 1నుంచి ప్రార్థనామందిరాలను తెరుస్తాం

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రకటన

కోల్‌కతా,మే30(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న లాక్‌డౌన్ 4.0 ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రార్థనా స్థలాలను తిరిగి తెరవనున్నట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ప్రార్థనా స్థలాలు తెరువనున్నట్టు ప్రకటించిన మొదటి రాష్ట్రంగా పశ్చిమబెంగాల్ నిలువనుంది. జూన్ 1 నుంచి మరో 15 రోజుల పాటు కేంద్రం మరో విడత లాక్‌డౌన్ పొడిగించే అవకాశం ఉందంటూ ప్రచారం జరుగుతున్న తరుణంలో మమత ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలన్నీ 100 శాతం పూర్తి సామర్థ్యంతో తెరవాలని కూడా పశ్చిమబెంగాల్ సర్కార్ నిర్ణయించింది. 'గత రెండు నెలల్లో కోవిడ్-19 వ్యాప్తిని విజయవంతంగా అదుపు చేశాం. బయట నుంచి జనం రావడంతో ఇప్పుడు కేసులు పెరుగుతున్నాయని మమతా బెనర్జీ పేర్కొన్నారు. దీనికి ముందు, సామాజిక దూరం నిబంధనలతో ప్రార్థనా స్థలాలు తెరుచుకునేందుకు అనుమతించాలంటూ ప్రధాని మోదీకి మమతా బెనర్జీ లేఖ రాశారు. కర్నాటక కూడా ఆలయాలను తెరవాలని నిర్ణయించినా కేంద్రం ఆదేశాల మేరకు నిర్ణయిస్తామని సిఎం యెద్యూరప్ప ప్రకటించారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## ప్రతికూల సంకేతాలతో మార్కెట్లు డౌన్

ముంబై,మే30(ఆర్ఎన్ఎ): రెండు మూడ్రోజులుగా లాభాల్లో ట్రేడ్ అవుతున్న స్టాక్ మార్కెట్ నష్టాల్లో కూరుకున్నాయి. శుక్రవారం ఉదయం ఓపెనింగ్ లోనే 300 పాయింట్ల నష్టంతో 31,896 సెన్సెక్స్ ట్రేడింగ్ మొదలైంది. అలాగే నిఫ్టీ 75 పాయింట్ల నష్టంతో 9414 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాల కారణంగా మార్కెట్లు డౌన్ అయ్యాయి. అత్యధికంగా బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 1.25శాతం నష్టపోయి 19వేల దిగువన 18,927.20 వద్ద ట్రేడ్ అవుతోంది. రెండ్రోజులుగా లాభాల్లో నడిచిన యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఇండసెండ్ బ్యాంక్, ఎస్బీఐ షేర్లు ఇవాళ కిందికి పడిపోయాయి. అలాగే ఇన్ఫోసిస్, టాటా స్టీల్, మారుతీ వంటి కంపెనీలు కూడా నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. స్టాక్ మార్కెట్స్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్న సమయంలో వొడాఫోన్ ఐడియా షేర్ మాత్రం 14 శాతం పైకి ఎగబాకింది. ఈ కంపెనీలో గూగుల్ పెట్టుబడులు పెట్టబోతోందన్న వార్తల నేపథ్యంలో పాజిటివ్ గా ట్రేడ్ అవుతోంది. ఎఫ్ఎంసీజీ, ఫార్మా కంపెనీల షేర్లు కూడా లాభాల్లో కనిపించాయి. మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మార్చి క్వార్టర్ జీడీపీ గణాంకాలు శుక్రవారం సాయంత్రం మార్కెట్ల ట్రేడింగ్ ముగిసిన తర్వాత విడుదల కానున్నాయి. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో జీడీపీ గ్రోత్ భారీగా క్షీణించే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. డిసెంబర్ తో ముగిసిన క్వార్టర్ లో 4.7 శాతంగా ఉన్న వృద్ధి.. ఇప్పుడు 2.1 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. దీనికి తోడు దేశవ్యాప్తంగా కరోనా కేసులు రోజు రోజూకు పెరుగుతుండటం, ఇండో-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, చైనాపై అమెరికా ఢీ అంటే ఢీ అంటుండడం మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి.

# కరోనాతో ఆర్థిక ఇబ్బందులు

## -డోలు వాద్యకారుడు ఆత్మహత్య

చిత్తూరు,మే30(ఆర్ఎన్ఎ): జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పులబాధ తట్టుకోలేక డోలు వాయిద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాళహస్తిలో జరిగింది. పట్టణంలోని బి.పి. అగ్రహారం ప్రాజెక్టు వీధికి చెందిన వెంకటరమణ (40) అనే వ్యక్తి ఉరేసుకొని మృతిచెందాడు. ఇతను శుభకార్యాలకు డోలు వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కరోనా కారణంగా శుభకార్యాలేవీ జరగకపోవడంతో కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దాంతో వెంకటరమణ అవసరాల నిమిత్తం కొంతమంది దగ్గర అప్పులు చేశాడు. అప్పిచ్చిన వారు 10 రోజుల్లో డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దాంతో ఏం చేయాలో తెలియక వెంకటరమణ ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన తర్వాత డాబా పైకి వెళ్ళి నిద్రపోయాడు. కుటుంబసభ్యులు ఉదయం లేచి చూసేసరికి వెంకటరమణ పంచెను మెడకు కట్టుకోని స్లాబ్ హుక్కుకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తన ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో తన బాధను పంచుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటరమణ మరణంతో ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రమణ మరణంతో పిల్లలు, భార్య కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జగన్‌వన్నీ రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలే

## పథకాలకు పేర్లు మార్చి అమలు

## ఏడాదిలో 80వేల కోట్ల అప్పులు: కాంగ్రెస్

విజయవాడ,మే30(ఆర్ఎన్ఎ): ఎన్నికలలో ప్రత్యేక హోదా, నవరత్నాల పేర్లతో ప్రజల్ని ఓట్లు అడిగి... చెప్పిన దానికి మాట తప్పి ఇప్పుడు చేస్తున్నది ప్రజా వ్యతిరేక నిర్ణయాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు గంగాధర్ విమర్శించారు. సంవత్సరంలోనే జగన్ 80 వేల కోట్లు అప్పులు చేసారన్నారు. రాజధాని గురించి స్పష్టత ఇస్తానని ఎక్కడా చెప్పలేదు కానీ... అస్పష్ట ప్రకటనలు చేశారని గంగాధర్ మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ నవరత్నాలు, రైతు భరోసాలో అన్ని మార్పులు చేర్చులే అని మండిపడ్డారు. ఎస్టీ, ఎస్సీ, బీసీల నిధులు అమ్మ ఒడికి మళ్లించారని అన్నారు. పేర్లు మార్చి పథకాలు అమలు చేసిన ఘనత కేవలం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ప్రచారం ఎక్కువ పనులు తక్కువ అని ఆయన విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ, అందరికి విద్య పథకాన్ని నేడు జగనన్న విద్యా దీవెనగా మార్పు చేశారని ఆరోపించారు. మద్యం నిషేధం అని చెప్పి మద్యం దుకాణాలు తెరిచి విచ్చల విడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకున్న ఘనత వైసీపీదే అని వ్యాఖ్యానించారు. జగనన్న వసతి దీవెన కూడా పాత పథకానికి కొత్త పేరు పెట్టారన్నారు.రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా 64 నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషనర్ అంశంపై సుప్రీం కోర్టుకు వెళ్తామంటున్నారని... మరి బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో ఎందుకు రివ్యూకి వెళ్ళలేదని ప్రశ్నించారు. అప్పులు, విద్యుత్ చార్జీలు పెంపు, కరోనా సమయంలో ఆర్థిక సాయం చేయలేదన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించారని... తమరెందుకు స్పందించలేదని నిలదీశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఎందుకు అడగలేకపోతున్నారన్నారు. పూర్తిగా కేంద్రానికి సరెండర్ అయిపోయారని గంగాధర్ వ్యాఖ్యానించారు.

# ఎపిలో కొత్తగా మరో 70 కేసులు

అమరావతి,మే30(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 70 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కొత్తగా నమోదైన కేసుల్లో మూడింటికి కోయంబేడుతో లింకులున్నాయి. గడచిన 24 గంటల్లో 9504 మంది నుంచి నమూనాలను సేకరించారు. ఏపీలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,944కి చేరింది. ఇప్పటి వరకు 2,092 మంది కరోనా బాధితులు కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో 792 యాక్టివ్ కేసులు ఉన్నాయి. శనివారం వరకు కరోనా వల్ల 60 మంది మృతి చెందారు.

# వ్యవసాయానికి బంగారు భవిష్యత్తు

## కాళేశ్వరంతో ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహం

## నియంత్రిత పంటలతో మారనున్న వ్యవసాయం

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): ఇక నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణా అన్న నినాదం ఎత్తుకున్న సిఎం కేసిఆర్ దీనిని నిజం చేసేందుకు ప్రాజెక్టులను జెట్ వేగంతో నిర్మిస్తున్నారు. కాళేశ్వరం, దేవాదుల పనుల వేగం చూసి అందరూ ఆశ్చర్య పోతున్నారు. ఈ ప్రాజెక్టులు కూడా పూర్తి అయితే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ రూపు రేఖలు మారుతాయనడానికి మరెంతో దూరం లేదని గుర్తించాలి. వ్యవసాయం పడావుపడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే...ఇది తెలిసిన నేతగా సిఎం కెసిఆర్ తొలినాళ్ల నుంచే వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగారు. రైతు అలిగితే మంచిది కాదని ఆయనకు తెలుసు. పాలకులు అన్నవారు ఇలాంటి ఆలోచనే చేయాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. తెలంగాణలో తజాగా తీసుకున్న నియంత్రిత సాగు విషయంలోనూ పెద్ద ఆలోచన దాగుంది. అంతా ఒకేరకమైన పంటలు వేసి గిట్టుబాటు ధరల కోసం పోరాడే కంటే చెప్పిన పంటలను వేసి గిట్టుబాటు ధరలు దక్కించుకోవాలన్నదే కెసిఆర్ నిర్ణయంగా భావించాలి. ఇది రైతులకు మేలు చేసేదే తప్ప మరోటి కాదు. అందుకే సిఎం నియంత్రిత పంటలే తప్ప నియంతృత్వ పంటలు కావని స్పష్టం చేశారు. ఉచితంగా విద్యుత్, నీటి సరఫరా, రైతుబంధు ద్వారా పెట్టుబడి, సకాలంలో ఎరువులు విత్తనాలు అందచేయడం , రైతులకు బీమా అమలు చేయడం వంటివన్నీ విప్లవాత్మక నిర్ణయాలు తప్ప మరోటి కావు. రైతుబంధు పథకం రైతులను నైరాశ్యంలో మునగకుండా చేసిన పనిగానే చూడాలి. వారికి అందించిన పెట్టుబడి ప్రోత్సాహకం అన్నది వారిలో భరోసా కల్పించేందుకు ఉద్దేశించినదిగానే భావించాలి. అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను చూస్తుంటే రైతులకు ఎంత చేసినా తక్కువే. వారిలో నైరాశ్యం నెలకొంటే ప్రపంచానికే ప్రమాదం. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం..పెట్టుబడి కోసం బ్యాంకులు విరవిగా రుణాలు ఇవ్వడం.. ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీ లుకుండా కొనుగోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు. అందుకే రైతులు కన్నీరు పెట్టకుండా అన్ని విధాలుగా అండగఆ నిలిచారు సిఎం కెసిఆర్. ఆయన ఇచ్చి ప్రోత్సాహం ఇప్పుడు వారిలో ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోని లేని విప్లవత్మాక వైన విధానాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్కరైతు రుణపడి ఉంటారు. కమిషన్లకు కక్కుర్తి పడి, ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా లక్షకోట్లు ఖర్చుపెట్టి నిధులు దిగమింగిన వారికి నిజంగా ఇది అర్థం కాని వ్యవహారంగానే ఉంటుంది. కాళేశ్వరం ద్వారా కొండపోచమ్మ వరకు గోదావరి నీళు తరలిస్తారని అంటే ఎవరూ నమ్మలేదు. కానీ మూడేళ్లలో సాక్షాత్కరింప చేసిన అరుదైన ఘట్టాన్ని చూసాం. ఈ పథకంతో సిఎం కేసిఆర్ దేశానికి కొత్త దారి చూపారు. రైతులను ఆదుకునేందుకు ఎలా బాటలు వేయాలో చెప్పారు. కొత్త చరిత్రకు నాంది పలికారు. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు ముఖ్యమంత్రి కేసిఆర్ గొప్ప ఆశయంతో తీసుకున్న నిర్ణయాలన్నీ ఓ ముందడుగు మాత్రమే. చెరువుల పునురుద్దరణ కార్యక్రమాలు పూర్తయి, ప్రాజెక్టులు సాకారం అయితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిన పడుతుంది. మూలనపడ్డ కులవృత్తులకు జీవం వస్తుంది. రైతులు బాగుపడితే మొత్తం గ్రామమే బాగుపడుతుంది. తెలంగాణలో ఇదే జరగబోతున్నది. ఆరు దశాబ్దాల పోరాటం,అమరుల త్యాగ ఫలితం, సిఎం కేసిఆర్ నాయకత్వంలో ఎంతో కష్టపడి తెచ్చుకున్నతెలంగాణను ఇష్టపడి అభివృద్ధి చేసుకునేందుకు సిఎం కేసిఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. గత నాలుగేళ్లలోనే తన పరిపాలన దక్షతతో చేపట్టిన పథకాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. అందరి దృష్టి తెలంగాణ వైపు ఆకర్షించేలా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు వ్యవసాయం పరిస్థితి,ప్రస్తుత వ్యవసాయ పరిస్థితి చూస్తే మనకు తేడా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. గతంలో రైతులకు కనీసం నాలుగుగంటలు కూడా కరెంటు రాక, విత్తనాలు, ఎరువులు దొరకక చెప్పులు క్యూలో పెట్టి ఎదురు చేసే రోజులను అప్పుడే ఎలా మరచిపోగలం. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అందించే ఏకైక రాష్ట్రంగా తెలంగాణను దేశంలో ముందువరసలో నిలబెట్టారు.

# పంటల చిరునామాగా ఖమ్మం నిలవాలి

## నియంత్రిత వ్యవసాయంతో ముందుకు సాగాలి

## రైతుల అవగాహన సదస్సులో మంత్రి పువ్వాడ

ఖమ్మం,మే30(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లా సమగ్ర పంటలకు చిరునామాగా నిలవాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రైతు చుట్టూనే ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఏది చేసినా రైతు కోణం నుంచే ఆలోచన చేస్తున్నారన్నారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ చేరుకుందన్నారు. ఇది మన ప్రభుత్వం సాధించిన ప్రగతి అన్నారు. నియంత్రిత సాగు విధానంపై నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామంలో నేడు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మంత్రి పువ్వాడ ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి క్లస్టర్ పరిధిలో రైతు వేదికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతు బాగు కోసమే సమగ్ర వ్యవసాయ విధానం తీసుకొచ్చారన్నారు. ఈ ఏడాది మొక్కజొన్న అధికంగా దిగుబడి వచ్చిందన్నారు. మరో ఏడాది వాడినా నిల్వలు తరిగిపోవన్నారు. అందుకే మక్కలు సాగుచేసి రైతు నష్టపోకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు. ప్రతి పంటలకు ముందు వ్యవసాయశాఖ ద్వారా భూసార పరీక్షలు, రైతు వేదికల ద్వారా రైతులకు సాగులో మెలకువలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు నీళు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. అందుకే సీతారామ ప్రాజెక్టు రూ. 12 వేల కోట్లు అదనంగా కేటాయించడం గానీ ఎన్ఎస్‌పీ ఆయకట్టును స్థిరీకరించడం గానీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా పంటలు సాగు చేసి రైతులు సహకరించాల్సిందిగా మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో నియంత్రిత పంటల సాగుపై జరిగిన సమావేశంలో రైతుకలు విత్తనాలు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

# రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

## అదే నమ్మకంతో ముందుకు వెళుతున్నాం

## రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన సిఎం జగన్

అమరావతి,మే30(ఆర్ఎన్ఎ): రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్‌ది అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. రైతుభరోసా కేంద్రాలతో గ్రామాల్లో విప్లవాత్మక మార్పు రాబోతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా శనివారం రాష్ట్రంలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ..తమ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రైతులతో గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలు ప్రారంభమయ్యాయని అన్నారు. 'మనది రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పాం.. చేశాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం తమదని, రైతు భరోసా ద్వారా రూ.10,200 కోట్లు 49 లక్షల రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. రైతుకు అవసరమైన సమయంలో సహాయం అందాలని, విత్తనం నుంచి పంట అమ్మకం వరకు రైతులకు అడుగడుగునా తోడుగా ఉంటామని భరోసానిచ్చారు. తొలి ఏడాది పాలన నిజాయితీతో, చిత్తుశుద్ధితో గడిచిందన్నారు. తన 11 ఏళ్ల రాజకీయ జీవిత చరిత్రలో కోట్లమందిని కలిశా. 3,648 కిలోమీటర్ల మేర సుదీర్ఘ పాదయాత్ర చేశా. పాదయాత్రలో ప్రజల కష్టాలు విన్నా.. చూశా. చదివించే స్థోమత లేక పిల్లలను బడులకు పంపని పరిస్థితులను చూశా. రైతుల ఇబ్బందులను చూశా. కష్టాలు పడుతున్న అక్కాచెల్లెమ్మల పరిస్థితులు చూశా. గుడి దగ్గర, బడి దగ్గర విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను చూశా. వీటన్నింటికి పరిష్కారంగా మేనిఫెస్టోను తీసుకొచ్చాం. కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్నవారందరికీ మంచి చేయాలని ఆలోచన చేశా.కేవలం రెండు పేజీల్లోనే మేనిఫెస్టో పెట్టాం. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించా. ఇప్పటికే మేనిఫెస్టోలోని 90 శాతం హామీలను నెరవేర్చామని జగన్ వివరించారు. చేసిన ప్రమాణానికి అనుగుణంగా మీ కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం కార్యాలయం నుంచి ప్రతి అధికారి దగ్గరా మేనిఫెస్టోను ఉంచాం. మేం ఇచ్చిన 129 హామీల్లో.. ఇప్పటికే 77 అమలు చేశాం. అమలు కోసం మరో 36 హామీలు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన 16 హామీలను కూడా త్వరలోనే పరుగులు పెట్టిస్తాం. మేనిఫెస్టోలో లేని మరో 40 హామీలను కూడా అమలు చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన అందించిన సంక్షేమ పాలన గురించి వివరించారు. ఊాష్ట్రంలోని 3 కోట్ల 58 లక్షల మందికి సంక్షేమ పథకాలు అందించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నారు. అలాగే రూ. 40,627 కోట్లను ఎలాంటి అవినీతి లేకుండా ప్రజల అకౌంట్లలో జమ చేసినట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీని మరింత మెరుగుపరిచి.. ఆరోగ్య ఆసరా ద్వారా డబ్బులు ఇస్తున్నాం. కంటి వెలుగు ద్వారా అవ్వా, తాతాలకు, విద్యార్థులకు పరీక్షలు చేయిస్తున్నాం. వాహన మిత్ర, లా నేస్తం, నేతన్న నేస్తం వంటి పథకాలను ప్రారంభించాం. కోటి 78 లక్షల బీసీలకు రూ.19,309 కోట్లు ఖర్చు చేశాం. 18 లక్షల 40వేల మంది ఎస్టీలకు రూ.2,136 కోట్లు ఖర్చు చేశాం. 19 లక్షల 5వేల మైనార్టీలకు రూ.17,222 కోట్లు ఖర్చు చేశాం. ఎక్కడా అవినీతికి తావులేకుండా నేరుగా వారి అకౌంట్లలోనే జమ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టో పేరుతో బుక్‌లు రిలీజ్ చేసేవారు. గత ప్రభుత్వం 600లకుపైగా హామీలిచ్చి.. 10శాతం కూడా నెరవేర్చలేదు. జన్మభూమి కమిటీల నుంచి రాజధాని భూముల వరకు.. అన్నీ తమ కనుసన్నల్లోనే ఉండాలని గత ప్రభుత్వం కోరుకునేది .ప్రభుత్వ భూమిని పేదలకు ఇస్తుంటే.. కోర్టుకెళ్లి అడ్డుకునే ప్రతిపక్షాన్ని ఇప్పుడే చూస్తున్నా. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులు.. చివరకు ప్రభుత్వ డెయిరీలను మూసివేసేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసింది. గత ప్రభుత్వంలో పేదలకు పథకాలు దక్కాలంటే జన్మభూమి మాఫియాకు లంచాలు ఇవ్వాల్సిందే. మన ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం. మాన ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరీ ఇంటికే వెళ్లి పథకాలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# పౌరసత్వ వ్యతిరేక ఆందోళనలు

## ఇద్దరు పింజ్రాతోడ్ కార్యకర్తలకు కస్టడీ

న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్ఎ): ఈశాన్య ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలో పాల్గొన్నారంటూ వచ్చిన ఆరోపణలతో ఇద్దరు పింజ్రా తోడ్ కార్యకర్తలకు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. దేవంగన కలిత, నటాషా నర్వాల్‌లను ఢిల్లీలో జరిగిన అల్లర్లతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వారిని అరెస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు పెండింగ్‌లో ఉంది. అరెస్ట్ చేసిన వారిని విచారించారు. నిందితులను అరెస్ట్ చేయడానికి తగిన కారణాలు ఉన్నాయి. ఆరోపణలు బలంగా ఉన్న కారణంగానే నిందితులకు జ్యూడీషియల్ కస్టడీ విధించాం. మళ్లీ వారిని జూన్ 11న కోర్టు ముందు హాజరు పరుస్తారని డ్యూటీ మెజిస్ట్రేట్ కపిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కలిత, నర్వాల్‌లను మార్చి 23న అరెస్ట్ చేశారు. జఫరాబాద్ సిట్-ఇన్ నిరసనలో వారి పాత్ర ఉందని ఆరోపణలు రావడంతో ఢిల్లీ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కాగా, మరుసటి రోజే బెయిల్ పొందారు. వారు బయటికి వచ్చిన నిమిషాల్లోనే వీరిద్దరిపై హత్యాయత్నం, అల్లర్లు, నేరపూరిత కుట్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో వారిని మళ్లీ అరెస్టు చేశారు.

# నల్లజాతీయుడి హత్యతో మిన్నంటిన ఆందోళనలు

## జస్టిస్ ఫర్ ఎఫ్లాయిడ్' అంటూ నిరసనలు

## తెల్లజాతి పోలీస్ అధికారిని అరెస్ట్ చేసిన అధికారులు

వాషింగ్టన్,మే30(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఓ పోలీసు కర్కశత్వానికి బలైన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్యకు నిరసనగా పలు నగరాల్లో శుక్రవారం ఆందోళనలు చెలరేగాయి. తొలుత శాంతియుతంగానే ప్రారంభమైన ఆందోళనలు అనతికాలంలోనే హింసాత్మకంగా మారాయి. 'జస్టిస్ ఫర్ ఎఫ్లాయిడ్' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. అనేక చోట్ల పోలీసుల వాహనాలు, అధికారిక భవనాలపై రాళ్లు రువ్వారు. మరికొన్ని చోట్ల వాహనాలు, రెస్టారెంట్లకు నిప్పంటించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిరసనల్ని అదుపు చేయడానికి టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. కొన్నిచోట్ల ఆందోళనకారుల్ని చెదరగొట్టేందుకు రబ్బరు బుల్లెట్లను ప్రయోగించే వరకూ వెళ్లింది. ఈ క్రమంలో పలువురు పోలీసులు గాయపడ్డారు. ఎట్టకేలకు నిందితుడిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దీంతో రంగంలోకి దిగిన 'పెంటగాన్' పరిస్థితి చేదాటకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అవసరమైతే మిలిటరీ పోలీసులు రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు ఓ సంబంధిత అధికారి తెలిపారు. మిన్నియాపోలిస్‌లో జార్జ్ ఫ్లాయిడ్ అనే నల్లజాతీయుడిని శ్వేతజాతీయుడైన పోలీస్ ఆఫీసర్ డెరెక్ చౌవిన్ అత్యంత అమానవీయంగా మెడపై మోకాలిని నొక్కిపెట్టి చంపిన ఘటనలో కీలక మలుపు తిరిగింది. ఆ కేసులో శుక్రవారం డెరెక్ చౌవిన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ శ్వేతజాతి పోలీసుపై థర్డ్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. నల్లజాతీయుడి మెడను మోకాలితో నొక్కిపెట్టిన కేసులో మొత్తం నలుగురు పోలీసులపై వేటు వేశారు. ఫ్లాయిడ్ మరణాన్ని ఖండిస్తూ అమెరికాలో నిరసనలు మిన్నంటాయి. మిన్నియాపోలిస్‌లో వందలాది షాపులను ధ్వంసం చేశారు. ఆఫీసర్ డెరెక్ చౌవిన్ కస్టడీలో ఉన్నట్లు హెన్నిపిన్ కౌంటీ ప్రాసిక్యూటర్ మైక్ ఫ్రీమన్ తెలిపారు. చౌవిన్ అరెస్టును మిన్నసోటా సేనేటర్ ఆమీ క్లోబుచార్ స్వాగతించారు. న్యాయం కోసం ఇది తొలి అడుగు అని ఆ సేనేటర్ అన్నారు. అయితే నిరసన కారులుమాత్రం ఆందోళనలకు దిగారు. ఆఫ్రికన్‌అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ మెడపై పోలీసు ఒకరు మోకాలితో తొక్కిపెట్టడంతో ఊపిరాడక గిజగిజలాడిపోయి చివరకు మరణించాడు. 'దయచేసి నా గొంతుపై కాలు తీయండి.. ఊపిరి ఆడట్లేదు. ప్రాణం పోయేలా ఉంది. నన్ను చంపేసేలా ఉన్నారు' అని విలవిలలాడిపోయినా ఆ కర్కశ పోలీసు కనికరించలేదు. అమెరికాలోని మినియాపోలిస్‌లో సోమవారం రాత్రి ఈ దుర్మార్గం చోటుచేసుకుంది.

# జియాగూడలో కరోనాతో వృద్ధురాలు మృతి

## ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): లాక్డౌన్ సడలింపులతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కరోనా కేసులు విస్తరిస్తున్నాయి. జియాగూడలో ఒక వ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. అతని తల్లి ఖైరతాబాద్ బీజేఆర్ నగర్‌లో నివసిస్తోంది. ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతని కుటుంబం పీజేఆర్ నగర్‌కు వచ్చింది. వృద్ధురాలు రెండు రోజుల క్రితం చనిపోవడంతో ఆమెకు కరోనా టెస్ట్ చేయగా.. పాజిటివ్ వచ్చింది. దాంతో ఆమె ఇంటికి వచ్చిన వారందరినీ టెస్ట్ చేస్తే ఒకేసారి ఎనిమిది కేసులు బయటపడ్డాయి. వీరంతా కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. దాంతో వీరిద్వారా ఎంత మందికి కరోనా సోకిందనేది పెద్ద సవాల్‌గా మారింది. జియాగూడ, బీజేఆర్ నగర్‌లలో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కూరగాయల వ్యాపారుల నుంచి ఎవరెవరు కూరగాయలు కొన్నారో వారందరినీ ట్రేస్ చేసే పనిలో బల్దియా అధికారులు బీజీ అయ్యారు. ఆ ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి అధికారులు సర్వే చేస్తున్నారు. హైడెన్సిటీ ఉన్న ప్రాంతం కావడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఒకేసారి ఎనిమిది కేసులు నమోదవడంతో బీజేఆర్ నగర్‌లో కంటెయిన్‌మెంట్ క్లస్టర్ ఏర్పాటు చేశారు. ఆ క్లస్టర్‌ను డిప్యూటీ కమిషనర్ గీత పరిశీలించారు.

# పంట కాలువ పనుల్లో వేగం పెంచాలి

## -అధికారులకు మంత్రి ఆదేశాలు

నిర్మల్,మే30(ఆర్ఎన్ఎ): గోదావరి ఆధారితంగా నిర్మల్ జిల్లాలో చేపట్టిన పంట కాలువ పనుల్లో వేగం పెంచాలని మంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే అధికారులను ఆదేశించారు. శనివారం గుండంపల్లి వద్ద 27- ప్యాకేజీ పంప్ హౌజ్ పనులను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి శ్రీధర్ రావు దేశ్‌పాండే పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కాలువ నిర్మాణం, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ ... ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకంలో భాగంగా కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, ప్రతి ఎకరాకు నీళ్ళందించేలా దృష్టిసారించారన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా పంటలకు సాగు నీరు అందించే దిశగా పనుల్లో వేగం పెంచాలన్నారు. గోదావరి ఆధారితంగా కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ పనులతో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన పనులు కొనసాగుతున్నాయన్నారు. 65 శాతం పనులు పూర్తయ్యాయని, ఇంకా 35 శాతం పనులు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. మాడేగావ్ వద్ద నిర్మిస్తున్న అండర్ టన్నెల్ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయన్నారు. ఇంకా 5 కిలోమీటర్లకు గాను నాలుగున్నర కిలోమీటర్ల మేర పని పూర్తి అయ్యిందని, మరో అర కిలోమీటర్ పనులు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్యాకేజీ పనులు పూర్తి అయితే నిర్మల్ జిల్లా మరింత సశ్యశ్యామలం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ, ఎస్ఆర్ఎస్పీ సీఈ శంకర్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సుదీర్ఘకాలం లాక్‌డౌన్ కుదరదు: కేజ్రీవాల్




న్యూఢిల్లీ,మే30(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ప్రజలు కరోనా కారణంగా భయపడాల్సిన పనేమీ లేదని సీఎం అరవింద్ కేజ్రీవాల్ అభయమిచ్చారు. మహమ్మారి కట్టడికి నాలుగు దశల్లో చర్యలు తీసుకుంటున్నామని ఆయన ప్రజలకు భరోసా కల్పించారు. ఇది ఆందోళన కలిగించే అంశమే కానీ భయపడాల్సిన పనిలేదన్నారు. కరోనా మహమ్మారికి నాలుగు దశల్లో కట్టడి చర్యలు తీసుకుంటున్నాం. ఆ విషయంలో మాత్రం మీకు నేను భరోసా కల్పిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దేశంలో సుదీర్ఘ కాలం లాక్‌డౌన్ విధించడం సాధ్యం కాదని, అది కట్టడికి శాశ్వత పరిష్కారం కూడా కాదని, తగు జాగ్రత్తలతో ప్రజలు వారి వారి జీవితాల్ని ముందుకు తీసుకెళ్లాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. ఢిల్లీలో ఎక్కువ సంఖ్యలో కరోనా కేసులు ఉన్నాయన్నది వాస్తవం. దాన్ని మేము అంగీకరిస్తున్నాం. కానీ భయపడాల్సిన పనేమీ లేదన్నారు. ప్రభుత్వం పక్షాన మేము అన్ని రకాలుగా సంసిద్ధతతోనే ఉన్నామని ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం. దేశాన్ని శాశ్వతంగా లాక్‌డౌన్‌లో ఉంచడం సాధ్యమయ్యే పనికాదని వీడియో కాన్ఫరెన్స్‌లో కేజ్రీవాల్ పేర్కొన్నారు. అందుకే అన్ని కార్యకలాపాలు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

# ప్రభుత్వం చెప్పిన పంటలే పండిస్తామన్న రైతులు

జగిత్యాల,మే30(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం చెప్పిన పంటలే పండిస్తామని జగిత్యాల జిల్లా అర్బన్ మండలం అంబారిపేట రైతులు ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నియంత్రిత పంటల సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సన్నరకం వరినే సాగు చేయాలని సూచించారు. రైతుబంధు పథకంపై ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కేసీఆర్ రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. రైతులందరికీ రైతుబంధు వర్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం అంబారిపేట రైతులు ప్రభుత్వం చెప్పిన సన్నరకం సాగుతో పాటు అంతర పంటలుగా మొక్కజొన్న, కందులను సాగు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఆకు పొగ ప్రాణాలను పీల్చుతుంది

ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాడడం కారణంగా ఎదురయ్యే తీవ్రమైన అనారోగ్య సమస్యల పట్ల ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడం మరియు పొగాకు వాడకాన్ని అరికట్టేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నాయకత్వంలో 1989 నుండి ప్రతియేటా 31 మే రోజున 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని' (వరల్డ్ నో టొబాకో డే) ఘనంగా జరుకోవడం జరుగుతోంది. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం-2020 నినాదంగా "పొగాకు రహస్యాలు బహిర్గతం చేద్దాం"గా నిర్ణయించి పలు పొగాకు వ్యతిరేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. అవగాహన లేమి, ఆధునిక విపరీత పోకడలు, వాణిజ్య ప్రకటనలు, ఫ్యాషన్ ట్రెండ్ మరియు మూఢనమ్మకాల కారణంగా యువతీయువకులు మరియు గ్రామీణులు పొగాకు దురలవాటు బారిన పడడం విస్మయాన్ని, విచారాన్ని కలుగ జేస్తోంది. ప్రస్తుత కరోనా కల్లోల కాలంలో పొగాకు వాడే వారికి ఈ మహమ్మారి వలన చాలా ప్రమాదం ఉందని తేలింది. పొగాకు ఉత్పత్తులను సిగరెట్, బీడి, చుట్ట, పేస్ట్, పైప్స్, గుట్కా, వాటర్ పైప్స్, ముక్కు పొడి, పొగాకును నోట్లో పెట్టు కోవటం మె?దలగు మాద్యమాల రూపంలో పేదల నుండి కుబేరుల దాకా పొగాకును వాడతారు.

పొగాకు వినియోగాన్ని తగ్గిస్తూ, వ్యాధులను నిరోధిస్తూ, మరణాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోనుట అవశ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించటం జరిగింది. పొగాకు ఉత్పత్తుల దురలవాటు కలిగిన వారిలో సగానికి పైగా చనిపోవడం ఒక విచారకర వాస్తవం. పొగాకు వాడకం ఒక భయంకర అంటువ్యాధిలా ప్రపంచ దేశాలలో విస్తరించి పలు అనారోగ్యాలకు కారణం అవుతోంది. అతి పెద్ద ఆరోగ్య సమస్యగా పేరొంది ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 1.3 బిలియన్, వీరిలో 80 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల జనులు పొగాకు వినియోగదారులు ఉన్నారు. 2030 నాటికి ఈ దురలవాటుతో 8 మిలియన్ల ప్రజలు ప్రతియేటా చనిపోతారని అంచనా. వీరిలో దాదాపు 6.5 మిలియన్లు నేరుగా పొగాకు ఉత్పత్తులు వాడుతూ మరియు దాదాపు 1.5 మిలియన్ల ప్రజలు పరోక్షంగా పొగాకు పొగకు లోనై (పాస్యూ స్మోకింగ్) మరణిస్తున్నారని తేలింది. వీరిలో 16 శాతం గుండె సంబంధ వ్యాధులతో, 25 శాతం కాన్సర్‌తో మరియు 52 శాతం శ్వాస సంబంధ వ్యాధులతో చనిపోతున్నారు. పొగ తాగే వారి జీవితకాలం కనీసం 10 సంవత్సరాలు తగ్గుతుందని నిపుణులు నిర్ధారించారు. నేటి యువత మరియు పిల్లలు అతి ప్రమాదకర ఈ-సిగరెట్లను వాడుతూ తమ భవిష్యత్తులను బుగ్గపాలు చేసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు సెకన్లలో ఒకరు పొగాకు వాడటం కారణంగా చనిపోవటం జరుగుతుంది.

మన భారత దేశంలో 2016-17లో నిర్వహించిన సర్వే ప్రకారం 15 సంవత్సరాలకు పైబడిన 26.7 కోట్ల ప్రజలు (పెద్దల జనాభాలో 29 శాతం) పొగాకు అలవాటును కలిగి ఉన్నారని తేలింది. ఒక్క అమెరికాలోనే 142 మిలియన్ల పొగాకు వాడేవారు, 127 మిలియన్ల పొగ తాగేవారు, ప్రతియోటా ఒక మిలియన్ మరణాలు నమోదు అవుతున్నాయి. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం నిర్వహిస్తున్న పొగాకు వ్యతిరేక ప్రచారం సఫలీకృతమై పొగాకు వాడే వారి సంఖ్య క్రమేనా గణనీయంగా తగ్గుట హర్షదాయకం. పొగాకు వాడే అలవాటు పడిన వారికి ప్రధానంగా ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం అవుతూ, సాలీనా 2.1 మిలియన్ ప్రజలు ఊపిరితిత్తుల కాన్సర్‌తో మరణించుట జరుగుతోంది. కాన్సర్‌తో మరణించే వారిలో 25 శాతం ప్రజలు పొగాకు వాడకం వలననే చనిపోతున్నారు.

**ప్రస్తుత కరోనా కల్లోల కాలంలో పొగాకు వాడే వారికి ఈ మహమ్మారి వలన చాలా ప్రమాదం ఉందని తేలింది.**

పొగాకు ఉత్పత్తుల పరిశ్రమలు ప్రతియేటా 8 బిలియన్ల ధనాన్ని ప్రచారానికి వెచ్చిస్తూ, కొత్త వాడకం దారులను ఆకర్షిస్తోంది. దాదాపు 15,000 రకాలైన పొగాకు ఉత్పత్తుల ద్వారా పిల్లలు మరియు కౌమారదశ యువతకు పొగాకు అలవాట్లను చేయాలనే ప్రయత్నాలు పరిశ్రమలతో జరుగుతున్నాయి. ఆకర్షణీయ ప్రచారాలు, సరదా వేడుకలు, పబ్‌లు, రేవ్ పార్టీలు, ఉచిత ఉపకార వేతనాలు, ఉచిత సాంపిల్‌ల సరఫరా, సామాజిక మాధ్యమాల ఆకర్షణలు, సినిమాల కారణంగా యువత మరియు పిల్లలు పొగాకు వాడకానికి ఉత్సాహం చూపుతున్నారు. పొగాకు వాడడంతో నోటి దుర్వాసన, పళ్ళు గారపట్టడం, చర్మం ముడత పడడం, గుండె పోటు, స్ట్రోక్, మూత్రపిండ సమస్యలు, ఊపిరితిత్తులు చెడిపోవడం, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, ఊపిరితిత్తుల మరియు నోటి కాన్సర్లు, పిల్లలలో మెదడు పెరుగుదల క్షీణించటం, పళ్ళు ఊడడం, చిగుర్ల సమస్యలు మె?దలగు దుష్ఫలితాలు కలుగుతాయి. పొగాకు వాడే వారికి క్షయ వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. క్షయ వ్యాధిగ్రస్థులలో 20 శాతం మంది పొగాకు కారణంగానే సంభవిస్తున్నాయి. పొగాకుకు అలవాటు పడిన పిల్లలలో ఉబ్బసం వ్యాధి సంభావ్యత ఎక్కువ కనిపిస్తుంది.

పొగాకులో దాదాపు 4000లకు పైగా రసాయనాలు ఉంటాయి. వీటిలో 60 రసాయనాలు కాన్సర్ కారకాలని కనిగొనబడింది. ఈ రసాయనాలలో అతి ప్రమాదకరమైన కాన్సర్ కారక 'నికోటిన్' కారణంగా ఊపిరితిత్తులు, తల మరియు మెడ కాన్సర్ రావచ్చు. పొగాకు వాడకంలో ఇండియా ద్వితీయ స్థానంలో ఉంది. మన దేశంలో ప్రతి రోజు 3,500 పొగాకు దురలవాటు కారణ మరణాలు సంభవిస్తున్నాయి. 2018 సంవత్సరంలోనే 3,17,928 మరణాలు నమోదైనాయని అంచనా వేస్తున్నారు. పొగాకు అలవాటును తగ్గించుటలో పోషకాహారం, ఫిజియోథెరపీ, యోగా లాంటివి కూడా ఉపయోగపడతాయి. పొగాకు వాడే వారిలో 55 శాతం మానాలనుకుంటారని, కాని సఫలీకృతులు కాలేరని తేలింది. దురలవాట్లలో ప్రధానమైనదిగా పొగాకు వాడకం నిలిచింది. పొగాకు దురలవాటు వలన ఆరోగ్యం క్షీణించటం, పేదరికం పెరగటం, పరోక్ష ప్రభావాలు పెరగడం, పొగాకు ఉత్పత్తుల పరిశ్రమలతో పర్యావరణ కాలుష్యం లాంటివి కూడా కలుగుతాయి. పొగాకు దురలవాటు గల వారు ప్రతియోటా సగటున రూ?లు 30,000 ఖర్చు చేస్తారని తేలింది. పొగాకు ఉత్పత్తికి 4.3 మిలియన్ హెక్టార్ల భూమి వినియోగించబడుతన్నాయి. పొగాకు పరిశ్రమలు 2 మిలియన్ టన్నుల వ్యర్థాలను విడుదల చేస్తాయి. పొగాకు సాగులో ఎరువులు మరియు పురుగు మందులు కూడా అధికంగా వాడతారు.

పొగాకు వ్యతిరేక ప్రచారంలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో నిషేధాలు విధించటం, పబ్లిక్ ప్రదేశాలలో బోర్డులు ఏర్పాటు చేయడం, దుష్ప్రభావాలను వివరించటం, పొగాకు వ్యతిరేక ర్యాలీలు, సభలు, సమావేశాలు, చర్చలు, విద్యాలయాలలో పొగాకు సంబంధ వ్యాధులపై పోటీలు, దురలవాటు ఉన్న వారిని త్యాగం చేసేలా ప్రోత్సహించటం, వైద్యశిబిరాల నిర్వహణ, పొగాకు దుష్ఫలితాల ప్రదర్శణలు లాంటి అంశాలను 31 మే రోజున నిర్వహించవచ్చు. పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దురలవాటుకు దూరంగా ఉంటామని, పొగాకు వాడే వారిలో అనగాహన కల్పించి మాన్పిస్తామని, పొగాకు లేని సమాజ స్థాపనలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తామని మనందరం ఈ రోజున ప్రతిన బూనుతూ, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ ఆరోగ్యాలను మరియు ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేద్దాం.

(31 మే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా)



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# విమర్శించే వారు పాటించి చూపాలి

## -కాంగ్రెస్, బిజెపిలకు కడియం చురకలు

వరంగల్,మే30(ఆర్ఎన్ఎ): నియంత్రిత వ్యవసాయంపై విమర్శలుచేసే ముందు అందులోని ఆధునిక వ్యవసాయ విధాన లక్షణాలను గుర్తించాలని మాజీ డిప్యూటి సిఎం కడియం శ్రీహరి అన్నారు. రైతులతో డిమాండ్ ఉన్న పంటలనే వేయించి వారికి భరోసా కల్పించడం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. దీన్ని విమర్శిస్తున్న వారు రైతులను అవహేళన చేస్తున్నారని అనుకోవాలని అన్నారు. ఇతర రాష్ట్రాలలో పాలిస్తున్న కాంగ్రెస్, బిజెపిలు ఇలాంటి పథకాలను ఎందుకు అక్కడ ప్రవేశపెట్టడం లేదో తెలపాలని శ్రీహరి ప్రశ్నించారు. రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోని లేని విప్లవత్మాకమైన పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని మంత్రి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్,బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రారంభించాలన్నారు. రైతులపై ప్రేమ ఒలక బోస్తున్నవారు చేసి చూపాలన్నారు. గత పాలకుల హయాంలో వ్యవసాయం దండుగ అన్న రైతులు నేడు వ్యవసాయం పండుగ అనేలా చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్కరైతు రుణపడి ఉంటారని అన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడి, ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా లక్ష కోట్లు ఖర్చుపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే అని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్నిరకాల పథకాలు అమలు చేస్తున్న ఏకైక సిఎం కేసిఆర్ అన్నారు. పేదింట్లో ఆడపిల్ల పుట్టిందంటే, ఆ పిల్ల పెళ్లీడుకు వచ్చిదంటే తల్లిదండ్రులకు భయం. ఆ పిల్ల పెళ్లి చేయడానికి వారు పడే అవస్థలు స్వయంగా చూసిన వ్యక్తిని తానేనని కడియం శ్రీహరి తెలిపారు.

పేదింట్లో గర్భిణీ అయిన తర్వాత కూడా ప్రసవం వరకు పనిచేయకపోతే గడవని పరిస్థితిని గమనించిన సిఎం కేసిఆర్ గర్భిణీ స్త్రీలకు గర్భం దాల్చిన మూడు నెలలు, ప్రసవం తర్వాత మరో మూడు నెలల పాటు నెలకు 2వేల రూపాయల చొప్పున 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే ప్రత్యేకంగా మరో వెయ్యి రూపాయలు కలిపి 13వేల రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా 15 రకాల ఉత్పత్తులతో కేసిఆర్ కిట్ ఇస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల్లో తెలంగాణ ప్రభుత్వం దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని కడియం శ్రీహరి అన్నారు. 5300 కోట్ల రూపాయలతో 42 లక్షల మందికి ఆసరా పెన్షన్లను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రభుత్వమే పంట పెట్టుబడి సాయం అందించడం దేశ రైతాంగ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని అన్నారు. ఈ విషయంలో యావత్ దేశానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. వ్యవసాయం బాగుంటేనే దేశం బాగుంటుందని గుర్తించే ఈ పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పూర్తయితే కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వ్యవసాయం బాగుండాలంటే భూములు, నీళ్లు, కరంటు ఉండాలని చెప్పారు.

# కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టండి

## పంటపెట్టుబడితో సస్యవిప్లవం తేవాలి

## సమస్యలుంటే సంప్రదించాలి: జోగు

ఆదిలాబాద్,మే30(ఆర్ఎన్ఎ): రైతులు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని మాజీమంత్రి ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన మహోన్నత కార్యక్రమాన్ని రైతుకు స్వర్ణయుగంగా అభివర్ణిస్తూ ప్రతీఒక్కరూ సాగుసహాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని సుసంపన్నం చేయాలని అన్నారు. నియంత్రిత పంటలతో సాగులో విప్లవం తేవాలన్నారు. తద్వారా అధిక ఉత్పత్తులు సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే వ్యవసాయ రంగంలో నంబర్‌వన్‌గా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. వానాకాలం సీజన్‌కు ముందుగానే రైతులు వారికి ఇష్టమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందని, వ్యాపారులు మాటలు నమ్మకుండా మేలు రకమైన విత్తనాలను తీసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి డబ్బులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. రైతులు ఇష్టానుసారంగా ఎరువులను వాడి డబ్బులు వృథా చేసుకోవద్దని వ్యవసాయ క్లస్టర్ పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటి ఆధారంగా ఎరువులను పంటలకు వినియోగించాలని కోరారు.

## పంట పెట్టుబడి నిరంతరం కొనసాగే పథకం

# రైతులు అందరికీ సాయం అందుతుంది

## ప్రాజెక్టులతో నీటికి ఢోకా లేకుండా పోయింది

## విపక్షాల ప్రచారంలో నిజం లేదు: మంత్రి వేముల

నిజామాబాద్,మే30(ఆర్ఎన్ఎ): భూమి ఉన్న ప్రతి ఒక్కరైతుకు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి అందుతుంది. భూములకు సంబంధించి ఏవైనా ఇబ్బందులుండి ఇప్పుడు పంట పెట్టుబడి రాని రైతుల సమస్యలను జిల్లా అధికారులు పరిశీలిస్తారు. నియంత్రిత పంటలను సాకుగా చూపి రైతుబంధును ఆపేస్తారన్న ప్రచారం సరికాదని సిఎం కెసిఆర్ నుంచి ఎమ్మెల్యేల వరకు చెప్పాల్సి వస్తోంది. రైతులకు పంట పెట్టుబడి ఇచ్చే ఈ రైతుబంధు పథకం ఇక నిరంతరాయంగా కొనసాగుతుందని, ఎవరూ అనుమాన పడాల్సిన అసవరం లేదని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దీనిపై అపోహలు సృష్టించడం సరికాదన్నారు. గతంలో వ్యవసాయం అంటే గిట్టుబాటుకానిదిగా, దండగగా ఉండేనని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు సిఎం కేసిఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు రైతు పంటపెట్టుబడి కోసం ఎవరివైపు చూడకుండా ఉండేందుకు ఎకరానికి 5000 చొప్పున ఏటా 10000 రూపాయల ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఇంత వరకు రైతుకు పంట పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వంగానీ, నాయకులుగానీ లేరన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన ఈ పంట పెట్టుబడి పథకంవైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. వ్యవసాయానికి కనీసం రెండు గంటలు కూడా కరెంటు రాని పరిస్థితిని మార్చి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారని, కోటి ఎకరాలను మాగాణాగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారని అన్నారు. రైతులకే కాకుండా పేదింట్లో ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావద్దని మొదట్లో 51వేల రూపాయలు ఇచ్చారని, అది సరిపోదని దానిని 75వేల రూపాయలకు పెంచారని, అదీ చాలడం లేదని ఇప్పుడు లక్షా 116 రూపాయలను ఇస్తున్నారన్నారు. పేదింట్లో ఆడపిల్ల గర్భం దాల్చితే ప్రసవం అయ్యే వరకు పని చేయాల్సి వస్తుందని గుర్తించిన సిఎం కేసిఆర్ ఇక అలాంటి పరిస్థితి ఉండొద్దని ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసవం తర్వాత మూడు నెలల వరకు నెలకు 2000 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే అదనంగా 1000 రూపాయలు కలిపి 13వేల రూపాయలు అందిస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా తల్లిబిడ్డలను అమ్మఒడి వాహనంలో ఇంటి దగ్గర దించుతున్న ప్రభుత్వం దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. ఇంతటి మంచి పథకాలు అమలు చేస్తున్న సిఎం కేసిఆర్‌ను నిండు మనసుతో దీవించాలని కోరారు. విపక్షలుచేసే ఆరోపణల్లో నిజాలు లేవని, ప్రజలను గందరగోళ పరిచేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం - చైర్మన్ గడ్డం హన్మాండ్లు





వేములవాడ,మే 30 (నేటినిజంప్రతినిధి)మార్కెట్ యార్డుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని నూతనంగా నియమితులైన వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు ,వైస్ చైర్మన్ ఉరిడి ప్రవీణ్ అన్నారు .రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తమ పాలకవర్గం పని చేస్తుందని అన్నారు .జిల్లా మంత్రి కె??టిఆర్ ,ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు .తమను ప్రతిపాదించిన ఎమ్మెల్యే రమేష్ బాబు ,ఆమోదించిన జిల్లా మంత్రి కె??టిఆర్ ,పైసా శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు .

# పదవి విరమణ పొందిన హోంగార్డుకు జిల్లా ఎస్పీ సన్మానం



వేములవాడ,మే 30 (నేటినిజంప్రతినిధి)పోలీస్ శాఖలో గత 36సం,,లుగా హోం గార్డ్ గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న జి. సత్యనారాయణ రాజన్న సిరిసిల్ల జిల్లా లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందాడు.ఎస్.పి రాహుల్ హెగ్డే పూలమాలలు వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారు, అని శుభాకాంక్షలు తెలియజేస్తు హోం గార్డ్స్ వెల్ఫ్ ఫెర్ నుడి ఆర్థిక సహయంగా 10,000-/రూపాయల చెక్ అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సేవను మరువవమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని. " పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు" అని కొనియాడారు. రిటైర్మెంట్ డబ్బులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా,పిల్లలకు దూరంగా ఉండి డ్యూటీలు చేసినారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.

ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇంచార్జ్ కుమార స్వామి గారు హెడ్ కానిస్టేబుల్ రవీందర్, హోం గార్డ్స్ సి.సి బాషా,దేవరాజు రవీందర్ పాల్గొన్నారు..

# గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

మెదక్,మే30(ఆర్ఎన్ఎ): జిల్లాలోని చేగుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నహెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి (54) గుండెపోటుతో మృతి చెందాడు. గత అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం గుంటూరు జిల్లా చిలకలూరిపేట. మృతునికి భార్య శివమ్మ, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

# వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డం హన్మాండ్లు వైస్ చైర్మన్‌గా ఉరుడి ప్రవీణ్

వేములవాడ,మే 30 (నేటినిజం ప్రతినిధి) వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది

వేములవాడ రూరల్ మండలం ఫాజిల్ నగర్ గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం హన్మాండ్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా అలాగే వేములవాడఅర్బన్ రుద్రవరం గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు ఉరడి ప్రవీణ్ ని మించింది. డైరెక్టర్లుగా పీర్ ముహమ్మద్ , దొంతుల అంజని, కుమార్ ,కనపర్తి అంజయ్య , భూముల లక్ష్మణ్ ,రెడ్డవనె?నిపావని ,మను పాటి తిరుపతి ,గోగూరి కమలాకర్ రెడ్డి ,పైడి శ్రీనివాస్ ,ఏనుగు తిరుపతిరెడ్డి ,రామతీర్థపు మాధవిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పాలకవర్గంలో ప్రతిపాదించిన ఎమ్మెల్యే రమేష్ బాబు , ఆమోదించిన జిల్లా మంత్రి కేటీఆర్ ,వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి నూతన పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది

# చెరువుల్లోకి త్వరలోనే గోదావరి జలాలు

## మల్లన్న సాగర్‌తో నెరవేరిన కల

## పంటలు పండిచి నమ్మకాన్ని నిలబెట్టండి: గొంగిడి సునీత

యాదాద్రి భువనగిరి,మే30(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు కొండపోచమ్మకు చేరుకునే అద్భుత ఘట్టం మరపురానిదని ఎమ్మెల్యు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. త్వరలోనే గంధమల్లకు నీరు చేరుతుందన్నారు. దీంతో ఈ ప్రాంతానికి ఇక సాగునీటి కొరత ఉండబోదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీపై నిర్మితమవుతున్న బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువుల్లోకి గోదావరి జలాలు రానున్నాయని తెలిపారు. అన్ని గ్రామాల చెరువుల తీరుపై నివేదికను తెప్పించుకుంటున్నామని గొంగిడి సునీత తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సాగునీరు అందించలేని కాంగ్రెస్ నాయకులు, తాజాగా ప్రాజెక్టులపై ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాలను ప్రారంభించారన్నారు. త్వరలో బస్వాపూర్ జలాశయంలోని 1.5 టీఎంసీ నీటిని విడుదల చేసి, అన్ని గ్రామాల చెరువుల్లోకి గోదావరి జలాలు రానున్నాయని చెప్పారు. రైతులకు నీళ్లందిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కాలం చెల్లినట్టేనని గుర్తు చేశారు. రైతులంతా సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని తెలిపారు. చెరువులను గొలుసుకట్టు కాల్వల ద్వారా నింపనున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు సిఎం కెసిఆర్ పడుతున్న తప అద్భుతమని అన్నారు. సీఎం కేసీఆర్ తన ఆలోచన విధానంతో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చేస్తున్నారన్నారు. ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సమగ్ర వ్యవసాయ పంట సాగు విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులకు పంట పెట్టుబడి, రైతు బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతు తాను పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకునేలా అన్ని గ్రామాల్లో మార్కెట్ వసతి కల్పించిన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న ఉచిత ఆర్థికసహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొంగిడి సునీత అన్నారు. ఎరువులు, విత్తనాలకు, ఇతర వ్యవసాయ పనులకు మాత్రమే సాగు పెట్టుబడిని వినియోగించు కోవాలన్నారు. రైతుబంధు పథకంతో వ్యవసాయ రంగంలో సరికొత్త వెలుగులు వస్తున్నాయని, సాగు కోసం దళారుల వద్దకు, వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లి అప్పులు చేసే సమస్యల నుంచి సీఎం కేసీఆర్ గట్టెక్కించారని అన్నారు. రైతులకు ఉచితంగా పెట్టుబడిని అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. దేశంలోనే రైతులను ఆదుకొని, వారికి ప్రయోజనం కలిగించే విధంగా సీఎం కేసీఆర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

# క్యూఆర్‌కోడ్‌పై కమీషనరేట్‌వ్యాప్తంగా కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు

కరీంనగర్, మే 30 (నేటినిజం ప్రతినిధి):క్యూర్‌కోడ్ విధానం అమలుపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కమీషనరేట్ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిరవధికంగా కొనసాగిస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే ప్రజల రక్షణ,భద్రతల సౌకర్యార్థం ప్యాసింజర్ వెహికిల్ డిజిటలైజేషన్‌లో భాగంగా క్యూర్‌ఆర్‌కోడ్(క్విక్ రెస్పాన్స్‌కోడ్)ను ఈ సంవత్సరం జనవరి 31న కమీషనరేట్ పోలీసులు ప్రారంభించిన విషయం విదితమే.

క్యూఆర్‌కోడ్ అమర్చిఉన్న వాహనాల్లోనే ప్రయాణించడంవల్ల కలిగే ప్రయోజనాలను వివిరిస్తూ ఈ కార్యక్రమాలను కమీషనరేట్ వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమాల సందర్భంగా సంబంధిత పోలీస్ అధికారులు రోడ్డుభద్రత నియమనిబంధనలు పాటించడం, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసిపి శంకర్‌రాజు క్యూర్‌కోడ్ విధానం అమలులో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన డ్రైవర్లు, అన్నివర్గాలకు చెందిన ప్రజలకు అవగాహన కల్పించే చర్యలతోపాటు ప్రయాణీకులకు గమ్యస్థానాలకు చేర్చే ప్రతి ప్రైవేటు వాహనం క్యూఆర్‌కోడ్ విధానాన్ని ఏర్పాటు చేసుకునేందుకుగాను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు.

**ఆటాపాటలతో అవగాహన కార్యక్రమాలు**

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలను ఆకర్షిస్తూ జానపదబాణీ, సుద్దులు, నాటికలు, నాట్యాల ప్రదర్శనలతోపాటు క్యూఆర్‌కోడ్ విధానం అమలుద్వారా చేగూరే ప్రయోజనాలను వివరించడం, రోడ్డుప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తున్నారు. కళాబృందం ఇంఛార్జి రామంచ తిరుపతి ఆధ్వర్యంలో ఈ బృందం ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. క్యూఆర్‌కోడ్ విధానం అమలుపై నిర్వహిస్తున్న ప్రతికార్యక్రమంలోనూ ఈ బృందం సభ్యులు పాల్గొంటున్నారు.

**ప్రయాణీకులకు ఎన్నెన్నో సౌకర్యాలు**

ఇందులో ఎమర్జెన్సీకాల్, ఎమర్జెన్సీటెక్ట్స్, కాంప్లెంట్, రేటింగ్ అంశాలు ఉంటాయి. ఎమర్జెన్సీ కాల్ చేయగానే కమాండ్‌కంట్రోల్‌కు చేరుతుంది. ఎమర్జెన్సీ ఎవష్ చేయగానే కమాండ్‌కంట్రోల్‌తోపాటు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందుతుంది. కాంప్లెంట్(ఫిర్యాదు) చేయగానే వాహనంలో ఏవైనా వస్తువులు మరచిపోయిన సందర్భంలో సదరు వాహనానికి సంబంధించిన డ్రైవర్ వివరాలు మెస్సేజ్ రూపంలో అందడంతోపాటు కమాండ్‌కంట్రోల్‌కు కూడా సమాచారం అందుతుంది. సాధారణఫోన్ వినియోగదారులు కూడా వాహనం బోర్డుపై ఉన్న నెంబర్‌కు మెస్సేజ్ (ఎస్‌యంఎస్)చేస్తే సంబంధిత పోలీసులకు ప్రయాణీకుడి వాహనానికి సంబంధించిన వివరాలు ఎస్‌యంఎస్ రూపంలో అందుతాయి.

**ప్రజలు కూఆర్‌కోడ్ ఉన్న వాహనాల్లోనే ప్రయాణించాలి**

క్యూఆర్‌కోడ్‌తో రిజిస్ట్రేషన్ చేయబడిన వాహనాల్లోనే ప్రజలు ప్రయాణించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ప్రజల భద్రత,రక్షణలను దృష్టిలో ఉంచుకుని ఈవిధానాన్ని కమీషనరేట్ వ్యాప్తంగా అమలుచేస్తున్నామని చెప్పారు. క్యూఆర్‌కోడ్ లేకుండా రోడ్లపైకి వచ్చే ప్రయాణీకులను చేరవేసే ప్రతి వాహనానికి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. తమప్రాంతాలో నిర్వహించే కార్యక్రమాలకు వీలుకల్పించుకుని హాజరై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.





# రాజీవ్ రహదారిపై పెరిగిన టోల్‌గేట్ రేట్లు

హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ): రాజీవ్ రహదారిపై టోల్‌గేట్ ఫీజులు పెరిగాయి. పెంచిన ధరలను ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలు చేయనున్నారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జనగామ తదితర జిల్లాలకు వెళ్లేవారిపై టోల్‌గేట్ భారం పడనుంది. కారు సింగిల్ ట్రిప్‌కు రూ.58, ఒకరోజు పాస్ రూ.87, నెల పాస్ రూ.1,740లుగా నిర్ణయించారు. ఎల్‌సీవీ/మినీ బస్సు సింగిల్ ట్రిప్ రూ.117, ఒకరోజు పాస్ రూ.175, నెల పాస్ రూ.3,510గా నిర్ణయించారు. ఈ ధరల పెంపుపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

# వానరాల ఆకలి, దాహార్తి తీర్చిన యువ ఫౌండేషన్

వేములవాడ,మే 30 (నేటినిజంప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పరిధి లోని పెద్దమ్మ అడవులలో కోతులు ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నాయి అని తెలుసుకున్న యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ ఫౌండేషన్ సభ్యులతో కోతులకు పలు రకాల పండ్లను అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కొరోనా మహమ్మారి కారణం గా వానరాలకు తమ వంతుగా పండ్లు అందిస్తున్నాం అని, ఎవరైనా జంతు ప్రేమికులు ఉంటే తమ తో కలిసి మూగ జీవాల ఆకలి తీర్చవచ్చని అని కోరారు మరియు కోతుల దాహార్తి తీర్చుట కొరకు కుండీ లలో నీటిని నింపాము అని దీనికి సహకరించిన నాగం పేటగ్రామ పంచాయతీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు గడ్డం ప్రశాంత్, తడుక గణేష్ , ఐతం ప్రశాంత్, సాజిద్, నవీన్, పర్శరాము, సాయి కిరణ్, వివేక్, ప్రదీప్, రాజు, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.